రామాలయ అభివృద్ధికి భూసేకరణ తప్పనిసరి: కలెక్టర్


రామాలయ సిబ్బంది, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయం అభివృద్ధికి ప్రభుత్వం బృహత్తర ప్రణాళిక అమలు చేయనుందని, ఇందుకు అవసరమైన స్థలాన్ని సేకరించాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ సూచించారు. ఈఓ రమాదేవి, ఆర్డీఓ దామోదర్‌రావుతో కలిసి ఆలయ పరిసరాలను గురువారం సందర్శించారు. ఇటీవల రూ.60.20 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని, ఈ సొమ్ముతో నిర్వాసితులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ మాడవీధుల విస్తరణకు అడ్డుగా ఉన్న దాదాపు ఎకరం స్థలం, ఇళ్లను స్వాధీనపరచుకునేందుకు పనులు ముమ్మరం చేయాలన్నారు. కల్యాణ మండపం, అన్నదాన సత్రాలను పరిశీలించి ఆ ప్రాంతంలో చేపట్టాల్సిన పనులపై సమాలోచనలు జరిపారు. రూ.42 కోట్లతో ప్రసాద్ పథకంలో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు.

పారదర్శకంగా అందజేయండి

భద్రాచలం, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు కుటుంబ డిజిటల్ కార్డులను తీసుకోవాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద భద్రాచలంలోని శాంతినగర్‌లో చేపట్టిన సర్వేను గురువారం పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. కుటుంబ సభ్యుల సమగ్ర వివరాలను పారదర్శకంగా అందించాలని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పెద్ద వయస్సు గల మహిళ కుటుంబ పెద్దగా ఉంటారని వెల్లడించారు.

క్లస్టర్లు పెంచితేనే.. కష్టాలు తొలిగేది..!

భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండలం కొమురారంలోని రైతు వేదిక ఇది. ఈ క్లస్టర్ పరిధిలో 8,756 మంది రైతులు 29,234 ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. సాధారణంగా ఒక క్లస్టర్‌లో 5వేల ఎకరాల సాగుభూమికి ఒక ఏఈఓ విధులు నిర్వర్తించాలి. అయితే ఈ క్లస్టర్‌లో సాగవుతున్న పంటల విస్తీర్ణానికి నిబంధనల ప్రకారం ఆరుగురు ఏఈఓలు పనిచేయాల్సి ఉన్నా.. ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నారు. క్లస్టర్ పరిధి విస్తృతంగా ఉండటంతో కొమురారం రైతు వేదికకు సుమారు 25కి.మీ. దూరంలోని ధర్మాపురం, పూసపల్లి, మిట్టపల్లి రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.



ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

క్షేత్రస్థాయిలో వ్యవసాయరంగ సేవలు అన్నదాతలకు దూరమవుతున్నాయి. సాగు రంగాన్ని బలోపేతం చేసేందుకు గత ప్రభుత్వం క్లస్టర్ల వారీగా రైతు వేదికలను నిర్మించి వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈఓ)ను నియమించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 67 క్లస్టర్లకు 67 మంది ఏఈఓలు విధులు నిర్వర్తిస్తున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో అన్నదాతలకు చేరవేయటంలో ఏఈఓలదే కీలక పాత్ర. అయితే భద్రాద్రి జిల్లాలో సాగవుతున్న పంటల విస్తీర్ణానికి సరిపడా క్లస్టర్లు లేకపోవటంతో అటు అన్నదాతలు, ఇటు ఏఈఓలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి సాగుభూమికి అనుగుణంగా క్లస్టర్లు ఏర్పాటుచేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

5.80 లక్షల ఎకరాలు.. 67 క్లస్టర్లు

ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో భద్రాద్రి జిల్లాలోని 67 క్లస్టర్ల పరిధిలో సుమారు 5.80లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. సగటున ఒక్కో క్లస్టర్ పరిధిలో దాదాపు 9వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేశారు. సాధారణంగా 5వేల ఎకరాలకే ఒక క్లస్టర్ ఉండాలి. జిల్లాలో 9వేల ఎకరాలకు ఒక క్లస్టర్ ఉండటంతో ఆశించిన స్థాయిలో అన్నదాతలకు సేవలందటం లేదు. వానాకాలంలో పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ మొదలు పంటలు చేతికందే వరకు 49 రకాల విధులను నిర్వర్తించే ఏఈఓలకు పనిభారం ఎక్కువవుతోంది.

పట్టాలెక్కని పంటల డిజిటల్ సర్వే

పంటల డిజిటల్ సర్వే పట్టాలెక్కటం లేదు. గత ఐదు రోజులుగా ఏఈఓలు విధులకు హాజరవుతున్నా.. గైర్హాజరైనట్లు అధికారులు నమోదుచేస్తున్నారని భద్రాద్రి జిల్లా ఏఈఓల సంఘం అధ్యక్షుడు నర్సింహారావు 'ఈనాడు'కు తెలిపారు. ఒక్కో ఏఈఓ సుమారు 10వేల ఎకరాల సాగుభూమిని సర్వే చేయటం సాధ్యం కాదన్నారు. ప్రభుత్వం గ్రామస్థాయిలో వ్యవసాయ సహాయకులను నియమిస్తే సర్వే చేస్తామని తెలిపారు.

ఖమ్మం జిల్లాలో అలా.. భద్రాద్రిలో ఇలా..

ఖమ్మం జిల్లాలో ఈఏడాది వర్షాకాలం 129 క్లస్టర్ల పరిధిలో సుమారు 6లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. సగటున ఒక్కో క్లస్టర్ పరిధిలో 5వేల ఎకరాల్లోపే పంటలు పండిస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో మాత్రం ఇందుకు భిన్నంగా ఒక్కో క్లస్టర్ పరిధిలో 9వేల ఎకరాల సాగు భూమి ఉండటం గమనార్హం. గతంలో క్లస్టర్లను ఏర్పాటుచేసే సందర్భంలో అధికారులు కేవలం రెవెన్యూ భూమిని ప్రామాణికంగా తీసుకోవటం వల్లే ఉభయ జిల్లాల్లో ఈ వ్యత్యాసం కనిపిస్తోంది. ఖమ్మం జిల్లాలో ప్రతి 5వేల ఎకరాల సాగు భూమికి ఒక క్లస్టర్ ఏర్పాటుచేసి దాని పరిధిలో రైతు వేదిక నిర్మించారు. భద్రాద్రి జిల్లాలో రెవెన్యూ భూమి కంటే ఆర్ఓఎఫ్ఆర్, పోడు భూములు ఎక్కువగా ఉండటంతో క్లస్టర్ల సంఖ్య తగ్గింది. దీనికితోడు గత ప్రభుత్వం పోడు భూములకు పట్టాలివ్వటం, వాటికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయటంతో భద్రాద్రి జిల్లాలో క్లస్టర్ల సంఖ్య కంటే సాగుభూమి ఎక్కువైంది.

ఎక్కడి పనులు అక్కడే..!

ఈటీవీ, ఖమ్మం, న్యూస్‌టుడే, ఖమ్మం గ్రామీణం: ఖమ్మం జిల్లాలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత భవన నిర్మాణ పనుల్లో కదలిక కనిపించటం లేదు. అరకొర సౌకర్యాల మధ్యే ఇంజినీరింగ్ విద్యనభ్యసించాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.300 కోట్ల అంచనాతో కళాశాల భవనం నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటికే తొలి విడతగా రూ.100 కోట్ల పనులపై అధికారులు సర్కారుకు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం పచ్చజెండా ఊపకపోవటంతో పనులు ప్రారంభమవలేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే ఏడాదైనా శాశ్వత భవనంలోనే తరగతులు నిర్వహించాలన్న సర్కారు లక్ష్యం నెరవేరేలా కనిపించటం లేదు.



వైటీసీ భవనంలో కొనసాగుతున్న జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల

ప్రభుత్వానికి రూ.100 కోట్లతో ప్రతిపాదనలు

కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి మద్దులపల్లి రెవెన్యూ పరిధిలో 30 ఎకరాల భూమిని అధికారులు కేటాయించారు. భవన నిర్మాణానికి జేఎన్‌టీయూ అధికారులు కాంటూరు సర్వే చేపట్టారు. తొలి విడతగా తరగతులు, అకడమిక్ భవనం, పరిపాలన భవనం, వసతిగృహాలు, ప్రయోగశాలల నిర్మాణానికి రూ.100 కోట్లతో సర్కారుకు ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వ అనుమతి రాగానే మొదటి విడత పనులు మొదలవుతాయి. తదనంతరం కళాశాల అవసరాలకు అనుగుణంగా మరికొన్ని భవనాల నిర్మాణానికి రూ.200 కోట్లు కావాలని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

మంత్రి పొంగులేటి చొరవ చూపాలని..

కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం గ్రానైట్ వ్యర్థాలు, బండరాళ్లతో నిండిపోయింది. ఇప్పటివరకు చదును చేసే పనులు మొదలుకాలేదు. ఈ పనులకే నెలల తరబడి సమయం పట్టే అవకాశముంది. ప్రభుత్వం అనుమతులు జారీ చేస్తే టెండర్ ప్రక్రియకు ముందడుగు పడనుంది. శాశ్వత భవనం వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి అందుబాటులోకి రావాలంటే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ చూపాలని విద్యార్థులు కోరుతున్నారు.

కొత్త భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు అద్దె భవనంలోనే జేఎన్‌టీయూ కళాశాల తరగతులు నిర్వహిస్తాం. వైటీసీలో కొనసాగుతున్న కళాశాలను జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్లు ఇటీవల పరిశీలించారు. శాశ్వత భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని సందర్శించారు. త్వరలోనే ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవుతాయని ఆశిస్తున్నాం.

- రమేశ్, ప్రిన్సిపల్, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల

అరకొర వసతులతో అవస్థలు

గత ప్రభుత్వ హయాంలో కౌన్సెలింగ్ సమయంలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల మంజూరైంది. ఖమ్మం గ్రామీణ మండలం మద్దులపల్లిలోని యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ) భవనంలో తాత్కాలికంగా కళాశాలను నిర్వహిస్తున్నారు. ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో 79 (సీఎస్ఈ-61, డేటా సైన్స్-18) మంది అభ్యసిస్తున్నారు. ఈఏడాది ప్రథమ సంవత్సరంలో 144 (డేటా సైన్స్-35, సీఎస్ఈ-63, ఈసీఈ-27, ఈఈఈ-14, మెకానికల్-05) మంది ప్రవేశాలు పొందారు. మొత్తం మీద 223 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడే తరగతులతో పాటు ప్రయోగశాలను నిర్వహిస్తున్నారు. బాలురకు వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. బాలికల వసతి కోసం ప్రైవేటు భవన సముదాయాన్ని అద్దెకు తీసుకున్నారు.


ఎంపికైన విద్యార్థులతో కార్యదర్శి రమేష్, కోచ్ సత్యబాబు, టీం మేనేజర్ శ్రీనివాస్

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు జట్టు ఎంపిక

కొత్తగూడెం పట్టణం, కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: తెలంగాణ బాక్సింగ్ ఓపెన్ స్టేట్ టోర్నమెంట్‌కు జిల్లా క్రీడాకారుల జట్టును గురువారం ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని షేక్‌పేటలో శని, ఆదివారాల్లో అండర్-14, 16 బాలుర విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. అండర్-14లో ఆర్.గణేశ్ (32 కిలోల విభాగం), కె.అరుణ్‌కృష్ణ (50 కిలోలు), యుగ్ అగ్రవాల్ (48 కిలోలు), అండర్-16లో తేజ్‌దీప్ (60 కిలోలు) చాణక్య (56 కిలోలు), షైను (48 కిలోలు), అభినయ్ (52 కిలోలు) ఎంపికైనట్లు కోచ్ సత్యబాబు తెలిపారు. ఎంపికైన జట్లకు మేనేజర్‌గా ఆర్.శ్రీనివాస్ వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు.

11 న భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో టార్చ్ రిలే

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: సీఎం కప్ క్రీడా పోటీలను మూడంచెల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముందస్తు అవగాహన కోసం ఈనెల 18 వరకు అన్ని జిల్లాల్లో టార్చ్ రిలే, 10కె రన్ నిర్వహించాలని సూచించింది. ఈనెల 11న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ కార్యక్రమం జరగనుంది. 11వ తేదీ ఉదయం కొత్తగూడెం పట్టణంలోని బొమ్మనపల్లి నుంచి సింగరేణి ప్రకాశం స్టేడియం వరకు 10కె పరుగు ఉంటుంది. అదేరోజు సాయంత్రం ఖమ్మం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్ కార్యాలయం వరకు 10కె రన్ జరగనుంది. టార్చ్ రిలే వాహన శ్రేణి 11వ తేదీ ఉదయం ములుగు బస్టాండ్ సెంటర్‌లో ప్రారంభమై సుజాతనగర్, జూలూరుపాడు, ఏన్కూరు, మంగాపురం, కొణిజర్ల, వెంకటాయపాలెం మీదుగా ఖమ్మం కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకుంటుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో టార్చ్ రిలే కార్యక్రమాన్ని డీవైఎస్ఓలు సునీల్‌రెడ్డి, పరంధామరెడ్డి పర్యవేక్షించనున్నారు.

డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియ పరిశీలన

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: లక్ష్మీదేవిపల్లి మండలం లాల్‌తండా పంచాయతీలో డిజిటల్ కార్డు ప్రయోగాత్మక సర్వేను గురువారం ప్రారంభించారు. జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ కార్యక్రమాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కుటుంబాల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయించుకోవాలని గ్రామస్థులకు సురేంద్ర మోహన్ సూచించారు. వివాహం చేసుకుని వెళ్లినవారు, మృతుల వివరాలు తొలగించాలని సిబ్బందికి సూచించారు. కుటుంబ సభ్యుల అనుమతితో గ్రూప్ ఫొటోను పొందపర్చాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, ఆర్డీఓ మధు, తహసీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళలతో కలల సాకారం..!

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, భద్రాచలం: హస్తకళా సమూహాలను నెలకొల్పి యువతకు శిక్షణనిచ్చి ఉపాధి కల్పించాలని రాష్ట్ర హస్తకళ అభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఇందులో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పేరొందిన హస్తకళలపై సమాచారం సేకరించి పంపించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఆదివాసీల కళా సంస్కృతికి భద్రాచలం ఐటీడీఏ పెద్దపీట వేస్తోంది. కొన్నేళ్లుగా ఈ ప్రక్రియ సాగుతున్నప్పటికీ ఇటీవల పీఓగా బాధ్యతలు చేపట్టిన రాహుల్, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఈ రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఐటీడీఏ పరిధిలో కేవలం ఎస్టీ సామాజికవర్గానికి మాత్రమే శిక్షణ ఇవ్వనుండగా.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో గిరిజన, గిరిజనేతరులు హస్తకళల్లో ప్రావీణ్యం పొందటానికి అవకాశం కలగనుంది.


భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో హస్తకళాకృతులు

ఉన్నత ప్రమాణాలతో కూడిన తర్ఫీదుతో..

భద్రాద్రి జిల్లాలో ఇప్పటికే రూ.32లక్షలతో నాయకపోడు హస్తకళల తయారీ కేంద్రం పనిచేస్తోంది. ఇందులో బూరుగు, పొనికి రకాల కర్రను ఉపయోగిస్తున్నారు. రూ.9లక్షలతో కోయకళల ప్రదర్శన కేంద్రం ఐటీడీఏలో ఉంది. ఇందులో టేకు, నాన్‌టేకు కలపను వాడుతున్నారు. వెదురుతో కొండరెడ్లు బొమ్మలు తయారుచేస్తున్నారు. వీరందరినీ కళా సమూహంగా ఏర్పాటుచేసి ఉన్నత ప్రమాణాలతో కూడిన శిక్షణ అందిస్తే ఉపాధి మెరుగవుతుంది.

☆ హస్తకళలపై రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇస్తే కళాకారుల్లో నైపుణ్యాలు మెరుగవుతాయి. గతంలో మేం బొమ్మల తయారీపై తర్ఫీదు పొందాం. ఇందులో ప్రోత్సహిస్తే చక్కని ఉపాధి లభిస్తుంది. **- పాయం కృష్ణమూర్తి, కళాకారుడు**

830 మందికి శిక్షణ పూర్తి

భవిష్యత్తులో చంద్రుగొండ మండలం బెండాలపాడు పర్యటక కేంద్రంగా మారనుందని అధికారులు భావిస్తున్నారు. ఈనేపథ్యంలో ఈగ్రామంలో ఇప్పటికే రూ.3కోట్లతో వెదురు కళాకృతుల విభాగం పనిచేస్తోంది. ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు మండలాలకు చెందిన 830 మంది గిరిజనులు ఇందులో భాగస్వాములుగా ఉంటూ శిక్షణ పొందారు. అయితే వీరికి ముడిసరకు సమస్య ఎదురవుతోంది. ఇక్కడ లభించే వెదురు.. కళాకృతుల తయారీకి అనువుగా ఉండటం లేదు. దీనిపై దృష్టి సారించిన ఐటీడీఏ పీఓ, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ త్వరలో ఇక్కడి గిరిజనులను అస్సాం రాష్ట్రానికి తీసుకెళ్లి అక్కడి వెదురును పరిశీలించనున్నట్లు తెలుస్తుంది. కొన్ని రోజులు అక్కడి నుంచే వెదురు దిగుమతి చేసుకోనున్నారు.

దూరవిద్య పరీక్షలు ప్రారంభం

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు కొత్తగూడెంలోని రెండు కేంద్రాల్లో గురువారం ప్రశాంతంగా ప్రారంభమైనట్లు డీఈఓ ముమ్మడి వెంకటేశ్వరాచారి, పరీక్షల సహాయాధికారి సాదనపల్లి మాధవరావు సంయుక్తంగా గురువారం ప్రకటించారు. ఇంటర్‌లో 74కి 49 మంది, పదోతరగతిలో 62కి 46 మంది హాజరైనట్లు వెల్లడించారు.

వైభవంగా లక్ష కుంకుమార్చన

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కలశస్థాపన పూజలు చేశారు. అనంతరం అర్చకులు గణపతిపూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, దీక్షాధారణ, గోపూజ, నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు తొలి రోజు బాలత్రిపురసుందరీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అగ్నిప్రతిష్ఠ, రుద్రహోమం, చండీహోమం, లక్ష కుంకుమార్చన వేడుకలు జరిగాయి. ఈవో రజనీకుమారి, ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఆలయ పరిధిలోని దుకాణాల నిర్వహణకు శుక్రవారం వేలం కొనసాగించనున్నట్లు ఈఓ రజనీకుమారి గురువారం ప్రకటించారు.


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

త్వరలో మరో మూడు వైద్యశాలల ఏర్పాటు

బూర్గంపాడు, న్యూస్‌టుడే

ముఖాముఖి

కార్మిక రాజ్య బీమా సంస్థ ఆధ్వర్యంలోని కార్మికుల కుటుంబాలకు మెరుగైన వైద్యసేవలందించటమే తమ ధ్యేయమని ఈఎస్ఐ వైద్యాధికారి డా.చందు అన్నారు. ప్రస్తుతం సారపాకలోని డిస్పెన్సరీకి తోడు మరో మూడు ఆసుపత్రులు ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. తద్వారా కార్మికులకు సత్వర వైద్యసేవలు అందటంతోపాటు దూరభారం తగ్గుతుందని వివరించారు. 'న్యూస్‌టుడే'తో ఆయన ముచ్చటించారు. ఆ వివరాలు మీ కోసం..


ఈఎస్ఐ వైద్యాధికారి డా.చందుతో

ఉభయ జిల్లాల్లో 25వేల మంది కార్మికులు

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సుమారు 25వేల మంది కార్మికులు ఈఎస్ఐ పరిధిలో ఉన్నారు. ఒక్కో కుటుంబానికి నలుగురు సభ్యుల లెక్కన చూసుకున్నా సుమారు లక్ష మందికి ఈఎస్ఐ ద్వారా ప్రయోజనం చేకూరుతుంది. ఉభయ జిల్లాలు పారిశ్రామికంగా ముందంజలో ఉండటంతో కార్మికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

సారపాక వైద్యశాలలో కంప్యూటరీకరణ పూర్తి

సారపాక వైద్యశాల(డిస్పెన్సరీ)ని పూర్తిస్థాయిలో కంప్యూటరీకరించారు. అన్ని వివరాలు అంతర్జాలంలో నమోదు చేస్తున్నాం. కార్మికుల వివరాలతోపాటు వారికి అందించిన ఔషధాలు, ధ్రువపత్రాలు తదితరాలన్నీ కంప్యూటర్ ద్వారానే జారీ చేస్తున్నాం. దీనికి అవసరమైన సిబ్బందిని సైతం నియమించాం. ప్రస్తుతం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పరిధిలో సారపాకలో మాత్రమే డిస్పెన్సరీ ఉంది. తరుణ వ్యాధుల నేపథ్యంలో ఇక్కడ నిత్యం 150 నుంచి 200 వరకు ఓపీ నమోదవుతోంది. వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఔషధాలు అందజేస్తాం. శస్త్రచికిత్సలు అవసరమైన వారిని వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలకు పంపిస్తున్నాం.

వైద్యసేవలు మరింత చేరువ

త్వరలో రామవరంలో ఓ డిస్పెన్సరీ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి స్థల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. ముదిగొండలో ఒక డిస్పెన్సరీ ఏర్పాటవుతుంది. ఖమ్మంలో డిస్పెన్సరీతో పాటు బ్రాంచి కార్యాలయం ప్రారంభమవుతాయి. కార్మికులకు దూరభారం తగ్గటంతో పాటు వైద్యసేవలు చేరువవుతాయి.

శ్రీహరిని పట్టించుకునేవారేరి..!

◆ఎనిమిదేళ్లుగా పాలకవర్గం కరవు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రెండో అతి పెద్ద దేవాలయం, తెలంగాణ తిరుపతిగా పేరొందిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ఇన్‌ఛార్జ్ అధికారుల పాలనలో కొనసాగుతోంది. ఎనిమిదేళ్లుగా పాలకమండలి నియామకం లేకపోవటంతో పర్యవేక్షణ కరవైంది. అభివృద్ధి ప్రతిపాదనలు కార్యరూపం దాల్చక, సకాలంలో సమస్యలు పరిష్కారం కాక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క శ్రీవారి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.


జమలాపురం శ్రీవారి ఆలయం

ఆలయ విశిష్టత

ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి 62.5 ఎకరాల మాన్యం ఉంది. అన్నదానానికి రూ.3కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. ఈ డిపాజిట్ల ద్వారా వచ్చిన వడ్డీతో భక్తులకు అన్నదానం అందిస్తున్నారు. ఆలయానికి హుండీ, టిక్కెట్లు, దుకాణాల, తలనీలాల వేలం ద్వారా సంవత్సరానికి దాదాపు రూ.6 కోట్ల ఆదాయం వస్తోంది. ఇంత స్థితి ఉన్నా అందుకు తగిన రీతిలో సదుపాయాలు లేవని, ప్రాచుర్యం సమకూరటం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకుపోతున్న సమస్యలు

★ ఆలయ ప్రాభవాన్ని పెంచే క్రమంలో భాగంగా చుట్టూ ప్రాకార మండపం, మూడు వైపులా రాజగోపురాలు, గిరిప్రదక్షిణకు మాడవీధులు నిర్మించాలంటూ గతేడాది ఆలయ అధికారులు, ధర్మకర్తలు ప్రభుత్వానికి నివేదించారు. నేటికీ ఈ విషయంలో ఇసుమంత పురోగతి లేదు.

★ ప్రాంగణంలో భక్తులు స్నానమాచరించేందుకు దాత రూ.40 లక్షలతో నిర్మించిన పుష్కరిణి నిరుపయోగంగా ఉంటోంది. దీన్ని వినియోగంలోకి తేవాలి.

★ కొండ కింద పార్కింగ్‌కు ప్రత్యేక షెడ్లు లేవు. దీంతో దూరప్రాంతాల నుంచి వ్యక్తిగత వాహనాలపై వచ్చిన భక్తులు ఇబ్బంది పడుతున్నారు.

★ సాధారణ రోజుల్లో 150 మందికి మాత్రమే అన్న ప్రసాదాలు సమకూరుస్తున్నారు. ఈ సంఖ్య 250కు పెంచాలి. శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా 300 టోకెన్ల నుంచి 500కు చేయాలి.

★ పర్యవేక్షణ లేకపోవటంతో విధి నిర్వహణలో కొంతమంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ఏం చేయాలి?

1 శ్రీవారి ఆలయానికి సహాయ కమిషనర్ స్థాయి అధికారిని నియమించాల్సి ఉంది. ఖమ్మంలోని నరసింహస్వామి ఆలయ గ్రేడ్-2 ఈఓ జగన్మోహన్‌రావు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. మధిర శివాలయం, కూసుమంచి జీళ్లచెర్వు ఆలయం, మారెమ్మ ఆలయాల బాధ్యతలూ ఆయనే నిర్వర్తిస్తున్నారు. దీంతో స్థానిక ఆలయంలో నిరంతర పర్యవేక్షణ కరవైంది.

2 శ్రీవారి ఆలయానికి ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒక్కసారి పాలకవర్గం ఏర్పాటు చేశారు. దాదాపు ఎనిమిదేళ్లుగా పాలకవర్గం లేదు. దీంతో ఆలయ అభివృద్ధికి నిధులు కోరే నాథుడు వారు కరవయ్యారు. ప్రభుత్వం ద్వారా నిధులు పొందేందుకు నూతన పాలకవర్గం ఏర్పాటు చేయాలని, వసతి పెంచాలని భక్తులు కోరుతున్నారు.

దేవాదాయ శాఖలో కొన్నేళ్లుగా పదోన్నతులు లేకపోవటంతో ఇతర ఆలయాలకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది. ఎక్కువ సమయం కేటాయిస్తూ ఆలయ పర్యవేక్షణ చేస్తున్నాం. పాలకమండలి ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వాలి.

- కె.జగన్మోహన్‌రావు, ఆలయ ఈఓ

కొత్తగూడెం సింగరేణి, ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే

ఆహ్లాదం.. విజ్ఞాన విహారం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒత్తిడితో కూడిన చదువులు విద్యార్థులను సతమతం చేస్తున్నాయి. వారికి బాహ్య ప్రపంచ విజ్ఞానం అంతగా తెలియకుండా పోతోంది. గతంలో మాదిరిగా పర్యాటక, విజ్ఞాన యాత్రలను విద్యాలయాల్లో ప్రస్తుతం నిర్వహించడం లేదు. కానీ, ఒకరోజు యాత్రలు వారిలో నూతనోత్సాహాన్ని ఎంతో కలిగిస్తాయి. ఇటీవల పర్యాటక దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన యువజన కళాశాలు, క్రీడాకారులు, జాతీయ సేవా పథకం విద్యార్థులు చండ్రుగొండ మండలం బెండాలపాడు కనకగిరి గుట్టలను సందర్శించారు. ఖమ్మం మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల బృందం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చొరవతో కనకగిరి గుట్టల్లో పులిగుండాలను సందర్శించింది. తామంతా అటవీ, పర్యాటక, చారిత్రక విశేషాలను ఎంతో ఆసక్తిగా తెలుసుకున్నట్లు సందర్శకులు 'న్యూస్‌టుడే'తో అభిప్రాయపడ్డారు. ఉమ్మడి జిల్లాలో 238 జూనియర్, 92 డిగ్రీ కళాశాలున్నాయి. ఇలాంటి సందర్శనలను అన్ని కళాశాలతో పాటు ఉన్నత పాఠశాలల్లో చేపడితే బాగుంటుందని పేర్కొన్నారు.


విహారయాత్రలో కొత్తగూడెం యువత సందడి


పులిగుండాల ప్రాజెక్టు సందర్శనలో ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు



కనకగిరి గుట్టలను సందర్శించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. అక్కడి పురాతన వీరభద్రస్వామి ఆలయం విశేషాలను తెలుసుకున్నాను. నాకు ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. ఆలయ సందర్శనతో మానసిక ప్రశాంతత పొందా.

- వి.శృతి, డిగ్రీ తృతీయ సంవత్సరం, గిరిజన సంక్షేమ కళాశాల, కొత్తగూడెం

నిత్యం చదువు, భవిష్యత్ లక్ష్యం వంటి ఒత్తిళ్లతో ఇబ్బంది పడే నేటి విద్యార్థి, యువ లోకానికి బెండాలపాడు వంటి విహార యాత్రలు ఆహ్లాదాన్నిస్తాయి. ప్రకృతిని కూడా ఒక తరగతి గదిలా భావిస్తా. ఇలాంటి యాత్రలు విద్యార్థులకు నూతనోత్తేజాన్నిస్తాయి.

- మడివి పవన్, టేకులగూడెం, ములకలపల్లి మండలం

మాది మహబూబాబాద్ జిల్లా చందగిరి. కళాశాల తరఫున బెండాలపాడు వద్దనున్న వీరభద్రస్వామి ఆలయం, ఏనుగుల బావి, పసుపుబావి, సమ్మక్క, సారక్క గద్దెల్ని సందర్శించడం మరపురాని అనుభూతినిచ్చింది. లెపార్డ్ టవర్ మీదుగా చూస్తే.. కనకగిరి గుట్టల అందాలు సాక్షాత్కరించాయి.

- జి.వీణ, డిగ్రీ విద్యార్థిని, కొత్తగూడెం

ఒకరోజు విహార యాత్రలో భాగంగా చాలా ఏళ్ల తర్వాత పాదాల ట్రెక్కింగ్‌కి వెళ్లా. పులిగుండాలలోని దేవాలయ పరిసర ప్రాంతాలు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. ఏకో సిస్టం ఎంతో నచ్చింది. ప్రతి ప్రాంతం విశేషాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నా.

- హారిక, బీఎస్సీ రెండో సంవత్సరం, ఖమ్మం





తోటి విద్యార్థులతో కలిసి పులిగుండాల ప్రాజెక్టును సందర్శించా. అక్కడి ప్రకృతి అందాలు మమ్మల్ని కట్టిపడేశాయి. మనకు అత్యంత సమీపంలోనే ఇలాంటి ఆహ్లాద ప్రదేశాన్ని తొలిసారి సందర్శించా. పర్యాటక విశేషాల్ని అటవీ శాఖ అధికారులు పరిచయం చేశారు.

- సుష్మా స్వరాజ్, బీఎస్సీ ఫైనలియర్, ఖమ్మం

జిల్లా కేంద్రానికి సమీపంలో.. అందమైన కొండల నడుమనున్న పులిగుండాల ప్రాజెక్టును మొదటిసారి చూశా. ఇంత గొప్ప పర్యాటక ప్రదేశం. గంగల పారే సెలయేళ్లు, వన్య ప్రాణుల సందళ్లు, పక్షి, వృక్ష జాతుల సమూహాలను విద్యార్థులకు పరిచయం చేస్తే మరిచిపోలేని అనుభూతినిస్తుంది.

- జి.శరీష, బీఎస్సీ విద్యార్థిని, ఖమ్మం

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోని చింతగుప్ప పోలీస్ స్టేషన్ పరిధిలోని బొత్తలంక-జాపల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య గురువారం ఎదురుకాల్పులు జరిగాయి. ఇరుపక్షాల నడుమ జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో మావోయిస్టులు బీజీఎల్(బ్యారెల్ గ్రేనేడ్ లాంచర్)లను సైతం వినియోగించినట్లుగా పోలీసు అధికారులు తెలిపారు. జిల్లా ఫోర్స్‌తో పాటు డీఆర్‌జీ(డిస్ట్రిక్ట్ రిజర్వ్‌డ్ గార్డ్), బస్తర్ ఫైటర్స్, కోబ్రావాహినీ బలగాలు ఈ సంయుక్త ఆపరేషన్ చేపట్టాయి. చింతవాగు నది ఒడ్డున ఉన్న అటవీ ప్రాంతంలో నక్సల్స్ ఆపరేషన్‌కు అదనపు బలగాలను పంపించారు. ఈ ఎదురుకాల్పుల ఘటనను ఎస్పీ కిరణ్ చౌహాన్ ధ్రువీకరించారు. అక్కడి అటవీ ప్రాంతంలో కూంబింగ్ కొనసాగుతోందన్నారు.

తల్లిదండ్రులు లేని పిల్లలకు రూ.1.30 లక్షలు వితరణ

అశ్వాపురం: అశ్వాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులులేని 26 మంది విద్యార్థులకు గౌతమి స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5 వేల చొప్పున రూ.1.30 లక్షలను గురువారం అందజేశారు. జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హెచ్.వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ అధికార ప్రతినిధి కె.సోమయ్య, ప్రిన్సిపల్ ఎన్.శేషుబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు జాతీయ స్థాయి గుర్తింపు

చింతకాని: వందనం పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీనివాసరావుకు గుర్తింపు లభించింది. గాంధీ జయంతి రోజు దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో సచ్ఛతాహీ సేవా ముగింపు కార్యక్రమంలో పాల్గొనే అవకాశం రాష్ట్రంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు దక్కగా వారిలో శ్రీనివాసరావు ఒకరు. ఈయన గతంలో కల్లూరు మండలం కొర్లగూడెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. ఆ సమయంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, డంపింగ్ యార్డు నిర్వహణ, నూరుశాతం మరుగుదొడ్ల వినియోగం, స్వచ్ఛభారత్ మిషన్, పంచాయతీలో రికార్డుల నిర్వహణ వంటి కార్యక్రమాల్లో ముందజంలో ఉండేవారు. ఈ సందర్భంగా దిల్లీలో ఉన్నతాధికారుల నుంచి పురస్కారం అందుకున్నారు.

రహదారి ప్రమాదంలో మహిళ దుర్మరణం

బూర్గంపాడు: ఏపీలోని కుక్కునూరు మండలం పెదరావిగూడేనికి చెందిన నడిపింటి సరిత(26) అస్వస్థతకు గురవటంతో ఆమె భర్త వినోద్‌కుమార్ బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై భద్రాచలం ఆసుపత్రికి తీసుకెళ్లారు. తిరుగుపయనంలో సారపాక వద్ద వీరి ద్విచక్ర వాహనాన్ని టూరిస్టు బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సరిత అక్కడికక్కడే మృతిచెందారు. వినోద్‌కుమార్‌కు తీవ్రగాయాలవటంతో బంధువులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మృతురాలి అత్త సరోజిని ఫిర్యాదు మేరకు ఎస్సై రాజేశ్ కేసు నమోదు చేశారు.

వివాహిత బలవన్మరణం

ములకలపల్లి: మూకమామిడికి చెందిన భూక్య రేణుక(23)కు టేకులపల్లి మండలం దంతాలతండాకు చెందిన భూక్య బాబులాల్‌కు 2022లో వివాహమైంది. వీరికి సంతానం కలగకపోవడంతో బాబులాల్ కుటుంబ సభ్యులు రేణుకను దూషించేవారు. ఆమె సోదరిని బాబులాల్‌కు ఇచ్చి వివాహం చేయాలని, లేనిపక్షంలో విడాకులు ఇవ్వాలని రేణుకను అత్తింటి నుంచి పుట్టింటికి వెళ్లగొట్టారు. ఈక్రమంలో సెప్టెంబర్ 27న రేణుక కలుపు మందు తాగారు. కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మం, అటు నుంచి కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి రేణుక చనిపోయారు. రేణుక ఆత్మహత్యకు కారకులైన బాబులాల్ అతడి కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లి హున్సేని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ పుల్లారావు గురువారం తెలిపారు.





నగర సిగలో అరణ్య హొయలు

ఖమ్మం నగర శివారులోని వెలుగుమట్ల అటవీ శాఖ పార్కులోవి ఈ దృశ్యాలు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో అభయారణ్యాన్ని తలపించే అడవి చూపరులను ఆకట్టుకుంటోంది. ప్రభుత్వం ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల గ్రామ పరిధిలో అటవీశాఖ పార్కును అభివృద్ధి చేసింది. సుమారు 400 ఎకరాల్లో వృక్ష సంపదతోపాటు పలురకాల ఔషధ మొక్కలను ఇక్కడ పెంచుతున్నారు. పలు రకాల పక్షులు, అడవి పందులు, కుందేళ్లు, నక్కలు, నెమళ్ల వంటి వన్యప్రాణులు ఆశ్రయం పొందుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అడ్వెంచర్ ఆటలు, సఫారీ వాహనం, వ్యూపాయింట్లు, సైక్లింగ్ వంటి సదుపాయాలు కల్పించారు. 100 రకాల ఔషధ మొక్కలను ఇక్కడ సంరక్షిస్తున్నారు.

– ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, ఖమ్మం వ్యవసాయం

జీపీఎస్ ట్రాకర్ పక్షి దొరికిందోచ్..


చర్లలోని అటవీశాఖ సంరక్షణలో జీపీఎస్ ట్రాకర్ పక్షి

చర్ల, న్యూస్‌టుడే: చర్లలో ఇటీవల జీపీఎస్ ట్రాకర్ ద్వారా సంచరించిన పక్షి ఎట్టకేలకు అటవీశాఖాధికారులకు గురువారం చిక్కింది. చర్లలోని నాయకకాలనీలోని ఏకలవ్య విద్యాలయం ప్రాంతంలోని గుట్ట సమీపంలోకి వచ్చిన పక్షి ఎటూ కదలకుండా ఉండటాన్ని గమనించిన స్థానికులు దానికి కోడి మాంసం పెట్టారు. తర్వాత ఎగిరి వెళ్లిపోయింది. ఈ పక్షి సంచారంపై 'ఈనాడు'లో ఈనెల 2న 'జీపీఎస్ ట్రాకర్‌తో గద్ద సంచారం' కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అరుదైన రాబందు సంతతికి చెందిన ఈ పక్షికి జీపీఎస్ ట్రాకర్, కెమెరా ఉన్నట్లు భావించడంతో స్థానికంగా దీని సంచారం కలకలం రేపింది. ఈ పక్షి సంచారంపై నిఘా వర్గాలతో పాటు పోలీసులు కూపీ లాగారు. జీపీఎస్ ట్రాకర్‌తో ఉన్న ఈ పక్షి ఆచూకీ కోసం చర్ల, ములుగు జిల్లా వెంకటాపురం అటవీశాఖ బృందాలు అన్వేషించాయి. జీపీఎస్ ఆధారంగా ఈ పక్షి ఆచూకీ ఎట్టకేలకు లభ్యమైంది. చర్ల మండలం తాలిపేరు పరీవాహక చినమిడిసిలేరు ప్రాంతంలో దీనిని పట్టుకున్న అటవీశాఖ సిబ్బంది చర్లలోని కార్యాలయానికి తరలించారు. అత్యధిక దూరం ప్రయాణించి నీరసంగా ఉండటంతో ఈ పక్షికి తగిన ఫీడింగ్ ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. అంతరించిపోతున్న ఈ రకం పక్షులు ఎక్కడ ఉన్నాయనే దాంతోనే ఈ పక్షికి జీపీఎస్ ట్రాకర్ ద్వారా పంపించి ఉంటారని అటవీక్షేత్రాధికారి ద్వాలియా 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ప్రస్తుతం ఈ పక్షి తమ సంరక్షణలోనే ఉందన్నారు. ఈ పక్షికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. ఈ పక్షిని అడవిలో వదిలేయాలా? లేక ఎక్కడి నుంచి వచ్చిందో అక్కడికి చేర్చాలనేది ఉన్నతాధికారుల నిర్ణయంపై ఆధారపడి ఉందన్నారు.

శరణము దేవీ.. అభయము నీవే!

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఖమ్మం నగరంలో పలు ప్రాంతాల్లో అర్చకుల వేద మంత్రోచ్చారణల నడుమ దుర్గామాత విగ్రహాలను నిర్వాహకులు మండపాల్లో ప్రతిష్ఠించారు. అమ్మవారి దేవాలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు భారీగా హాజరై అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలువురు భక్తులు అమ్మవారి దీక్ష మాలధారణ తీసుకొన్నారు. నగరంలోని శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం(గుట్ట)లో అమ్మవారు ఆదిలక్ష్మీ, గుట్టలబజారులోని శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో శ్రీబాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పారువేట స్థలం(జమ్మిబండ)లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, నీరాజన మంత్రపుష్పం జరిగాయి.


శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో ఆదిలక్ష్మీ అలంకరణ


శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు

సెమీస్‌కు ఉమ్మడి ఖమ్మం జట్టు

వరంగల్ క్రీడావిభాగం: ఓరుగల్లు కేంద్రంగా జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. కోమటిపల్లి మైదానంలో గురువారం జరిగిన పోరులో ఒక్క వికెట్ తేడాతో ఉమ్మడి నిజామాబాద్ జట్టుపై గెలుపొందింది. తొలుత నిజామాబాద్ జట్టు నిర్ణీత 35 ఓవర్లలో 207 పరుగులు చేసింది. ఖమ్మం జట్టు 35 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి సెమీస్‌లోకి దూసుకెళ్లింది. మొగిలిచర్ల మైదానంలో ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్ శుక్రవారం జరగనుంది.

వృత్తి నైపుణ్యంతోనే విధుల్లో రాణింపు

వరంగల్‌క్రైం: పోలీస్‌శాఖలో పనిచేస్తున్న అధికారులు విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్‌లో వరంగల్, ఖమ్మం కమిషనరేట్లు, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన అధికారుల జోనల్ డ్యూటీ మీట్‌ను ఆయన ప్రారంభించారు. పోలీసు అధికారులకు కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, వేలిముద్రల సేకరణ, హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫొటో, వీడియోగ్రఫీ పోటీలు నిర్వహించారు. ఒక్కో విభాగంలో ఇద్దరు చొప్పున ప్రతిభ కనబర్చినవారిని ఎంపిక చేసి, హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోలీసు డ్యూటీ మీట్‌కు పంపించనున్నారు.

కోలిండియా కండల వీరుడు మనోడే!

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

తండ్రిని చూసి శరీర సౌష్ఠవానికి కసరత్తు ప్రారంభించిన ఓ యువకుడు.. అనూహ్యంగా ఓ రోజు వారసత్వ ఉద్యోగ బాధ్యతలూ చేపట్టారు. సింగరేణిలో అరంగేట్రం చేసిందే మొదలు 'మిస్టర్ సింగరేణి'పై గురిపెట్టారు. ఆ లక్ష్యం పూర్తవగానే 'కోలిండియా' స్థాయిలో జెండా ఎగురవేశారు. జాతీయ స్థాయి బొగ్గు కంపెనీల స్థాయిలో హ్యాట్రిక్ కండల వీరుడిగా పట్టుదలతో స్వర్ణాలు చేజిక్కించుకున్నారు. ఆయనే.. మద్దెన రామకృష్ణ.

కొత్తగూడెం బూడిదగడ్డకు చెందిన మద్దెన శ్రీనివాస్‌కు శరీర దారుఢ్యంపై అంటే ఎంతో ఆసక్తి. నిత్యం సాధన చేసేవారు. తన కుమారుడు రామకృష్ణకూ కండలు పెంచడంపై ఆసక్తిని కలిగించారు. కొత్తగూడెం ఏరియాలో ఏడో షాఫ్టులో పనిచేసే శ్రీనివాస్ కొన్నేళ్ల క్రితం గని ప్రమాదంలో మరణించారు. దీంతో రామకృష్ణ వారసత్వ ఉద్యోగం ద్వారా సింగరేణిలో చేరారు. ప్రస్తుతం ఆయన సత్తుపల్లి జేవీఆర్ ఉపరితల గనిలో అసిస్టెంట్ ఫైన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగాన్నే కాదు, తన తండ్రి ఆశయాన్నీ పుణికిపుచ్చుకున్న ఈ యువ ఉద్యోగి.. సింగరేణి శరీర సౌష్ఠవ (బాడీ బిల్డింగ్) పోటీల్లో రాణించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అరంగేట్రం చేసిన 2010లోనే కఠోర సాధన ఆరంభించారు. 2016 నుంచి సింగరేణి పోటీల్లో 70-75 కిలోల విభాగంలో ప్రాతినిధ్యం వహించారు. తాజాగా 'మిస్టర్ కోలిండియా'గా ఎంపికై ఉన్నతాధికారుల ప్రశంసలందుకున్నారు.



హ్యాట్రిక్ విజయాలు నమోదు

2022, 2023, 2024లో వివిధ ఏరియాల్లో జరిగిన కంపెనీ స్థాయి పోటీల్లో మిస్టర్ సింగరేణిగా వరుసగా ఎంపికయ్యారు. 2022-23 నుంచి వరుసగా మూడేళ్లలో మిస్టర్ కోలిండియాగా విజయాన్ని అందుకున్న సింగరేణి ఉద్యోగిగా ఖ్యాతి దక్కించుకున్నారు. ఈ ఏడాది జాతీయ స్థాయి పోటీలు సెప్టెంబరు 28న ఒడిశాలో ముగిశాయి. ఈ పోటీల్లో 'మిస్టర్ కోలిండియా'గా సింగరేణి పతాకాన్ని జాతీయస్థాయిలో ఎగురవేశారు.



"కోలిండియాలో స్వర్ణపతకాన్ని గెలవాలన్న స్వప్నం నిజమైంది. మిస్టర్ సింగరేణి, కోలిండియా హోదాను హ్యాట్రిక్ కొట్టడం జీవితంలో మరిచిపోలేను. కేవలం కంపెనీ స్థాయి పోటీలే కాకుండా ఓపెన్ టోర్నీలకు హాజరుకావాలని నిర్ణయించుకున్నా. ఇందుకు సాధనతో పాటు ఎంతో ఖర్చుతో కూడిన పోషకాహారాన్ని తీసుకోవాలి. మాలాంటి యువ క్రీడాకారులకు సింగరేణి యాజమాన్యం మరింత ప్రోత్సాహం, ఆర్థిక వెసులుబాటు కల్పిస్తే ఏ పోటీల్లోనైనా రాణిస్తాం అని నమ్ముతున్నా". - రామకృష్ణ

భూత దయ చూపుదామయ!

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే



భూమ్మీద మనుషులకు జీవించే హక్కు ఉన్నట్లే జంతువులకూ కొన్ని హక్కులు ఉన్నాయని వాటిని రక్షించాల్సిన బాధ్యత మనదేనని చాటుతోంది ప్రపంచ జంతు దినోత్సవం. ఏటా అక్టోబరు 4న దీన్ని నిర్వహిస్తారు. జిల్లాలోనూ జంతు ప్రేమికులు వాటి హక్కుల పరిరక్షణకు పాటుపడుతున్నారు. మూగజీవులపై భూత దయ చాటుతున్నారు.

★ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని మైదాన ప్రాంతాల్లో వ్యవసాయం, పాడి పరిశ్రమ కోసం జంతువులు, కోళ్లు వంటివి పెంచుతున్నారు. శునకాలు, పిల్లులు, వీధి కుక్కలు మనుషులతో కలిసి జీవిస్తున్నాయి. ఇటీవల శునకాల బెడద ఎక్కువైన నేపథ్యంలో ఖమ్మం నగరంలో కొంతమంది వీటిని విషం పెట్టి చంపుతున్నారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై జంతు ప్రేమికులు కొండబోలు లక్ష్మణ్, బెజ్జంకి శ్రీనివాస్, విక్రమ్‌శర్మ తదితరులు కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ఫిర్యాదు చేశారు.

	ఖమ్మం	భద్రాద్రి
పశువులు(తెల్లజాతి)	1,41,117	2,00,844
పశువులు(నల్లజాతి)	3,75,103	1,25,587
గొర్రెలు	6,67,318	1,55,406
మేకలు	1,90,013	2,00,462
పెంపుడు కుక్కలు	13,211	-
నాటు కోళ్లు	20,545	-

రక్షణకు చట్టాలు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ, జి ప్రకారం పౌరులు సాటి జీవులపై కరుణ కలిగి ఉండాలి. జంతువులు, పక్షులను ఇతర ప్రాంతాలకు తరలించేటప్పుడు రైలు, సముద్ర మార్గాల్లో తగిన సదుపాయాలు కల్పించాలి. గోసంరక్షణ చట్టం గోవధను, జంతు బలిని నిషేధించింది. ఆవులను ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్ కబేళాలకు తరలిస్తుండగా జిల్లాలో పలుమార్లు పట్టుకున్నారు. లారీలు, డీసీఎం వాహనాల్లో కుక్కి ఊపిరి ఆడకుండా తరలిస్తున్నారు. ఇవన్నీ చట్టప్రకారం నేరమే.

జంతువులను ప్రేమిద్దాం

జిల్లావ్యాప్తంగా జంతు ప్రేమికులు పశువులు, శునకాలు, కోతులకు ఆహారం పెడుతున్నారు. ప్రభుత్వం కోతుల కోసం ప్రత్యేక ఫుడ్ పార్కులు నిర్మించింది. వీధి కుక్కల నియంత్రణకు మున్సిపాల్టీల్లో సంతాన నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. జంతువులపై జాలి చూపించాలని, వాటిని హింసించడం, చంపడం సరి కాదని **జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ బి.వేణుమనోహర్‌రావు** పేర్కొన్నారు. ప్రపంచ జంతు దినోత్సవాన మన బాధ్యతలు మరోసారి గుర్తు చేసుకోవాలని కోరారు.



నేడు అవగాహన సదస్సులు

ప్రపంచ జంతు దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. గొత్తికోయలకు జంతువుల ప్రాధాన్యం గురించి వివరిస్తారు. గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తారు. వేట నివారించేందుకు పెట్రోలింగ్ నిర్వహిస్తారు.

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	4,300	7,011	6,500
పాతపత్తి	6,500	7,600	7,400
పెసలు	5,400	7,100	6,000
ఏసీ ఎండుమిరప	11,000	20,000	18,000
ఎండుమిరప	9,000	18,100	17,500
ఏసీ తాలుమిరప	9,000	10,000	9,500
తాలుమిరప	5,000	10,000	6,500

భద్రాచలం

•భద్రాచలం •పినపాక •అశ్వారావుపేట

బొగ్గు ఉత్పత్తికై నిర్దిష్ట ప్రణాళిక రూపొందించుకోవాలి



వ్యూపాయింట్ నుంచి పరిశీలిస్తున్న వెంకటేశ్వర రెడ్డి, రాంచందర్

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఏరియా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని బొగ్గు ఉత్పత్తికి అవసరమైన నిర్దిష్టమైన ప్రణాళికలను రూపొందించుకోవాలని సింగరేణి ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన తొలుత పీకేఓసీ 4, పీకేఓసీ 2 వ్యూ పాయింట్లను సందర్శించి క్వారీలో జరుగుతున్న బొగ్గు ఉత్పత్తిని, యంత్రాల ద్వార జరుగుతున్న బొగ్గు లోడింగ్‌ను పరిశీలించారు. ఏరియా జీఎం దుర్గం రాంచందర్, ఎస్వోటూ జీఎం శ్యాంసుందర్, అధికారులు లక్ష్మీపతి, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రక్త పరీక్షలు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: దుమ్ముగూడెం పీహెచ్‌సీలో ఈనెల 4 నుంచి 29 తేదీ వరకు అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి పుల్లారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 4, 8, 11, 14, 15, 17, 19, 22, 24, 26, 29 తేదీల్లో రక్త పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: అశ్వారావుపేటలోని దొంతికుంట చెరువు వద్ద బతుకమ్మ ఘాట్ అధ్వానంగా మారింది. కోనేటి చెరువులో గుర్రపుడెక్క పెరగడంతో బతుకమ్మలు నిమజ్జనం చేయటానికి వీల్లేకుండా తయారైంది.
- డి.త్రినాథ్, టి.వెంకన్న, అశ్వారావుపేట

సమాధానం: దొంతికుంట, కోనేరు చెరువుల సమస్య మా దృష్టికి వచ్చింది. వెంటనే శుభ్రం చేయిస్తాం. - కె.శ్రీరామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి, అశ్వారావుపేట
– అశ్వారావుపేట, న్యూస్‌టుడే

స్వయంకృషితో ఉద్యోగ సాధన

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే

పట్టుదలతో ఎంచుకున్న లక్ష్యాన్ని ఆ యువకుడు సాధించాడు. నాలుగు పోస్టులకు వేల మంది పోటీపడితే ఆ యువకుడు ముందంజలో నిలిచి సత్తాచాటాడు. మణుగూరు పట్టణంలోని బాపనకుంటకు చెందిన ఎన్.సాయికిరణ్ అనే యువకుడు చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ కంపెనీలో కేంద్ర ప్రభుత్వ కొలువు సాధించాడు. ఎలక్ట్రికల్ విభాగంలో సాయికిరణ్ జూనియర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యారు. సాయి కిరణ్ 2016లో పదో తరగతి 9.3 పాయింట్లు సాధించాడు. పాలిసెట్‌లో ర్యాంకు రావటంతో కొత్తగూడెంలో 2019లో డిప్లొమా పూర్తి చేశాడు. అప్పటి నుంచి ప్రభుత్వ కొలువు సాధించేందుకు సొంతంగా సిద్ధమయ్యాడు. ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో చెన్నై పెట్రోలియం కార్పొరేషన్ కంపెనీలో ఉద్యోగ ప్రకటన వెలువడటంతో దరఖాస్తు చేసుకున్నాడు. జూనియర్ ఇంజినీర్ విభాగంలో నాలుగు పోస్టులకు 4 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. రాత పరీక్షలో మొదటి స్థానంలో నిలిచాడు. ముఖాముఖిలో రెండో స్థానంలో నిలిచి ఉద్యోగాన్ని సాధించాడు. ఈనెల 20వ తేదీన సాయికిరణ్ ఉద్యోగ నియామక పత్రాన్ని పొందాడు. ఏడాదిపాటు శిక్షణ సమయంలో నెలకి రూ.40 వేల జీతం పొందనున్నాడు. శిక్షణ అనంతరం సాయి కిరణ్ ఎక్కువ జీతాన్ని పొందనున్నాడు. సాయికిరణ్ తండ్రి నర్సింహారావు 12 ఏళ్ల క్రితం మృతి చెందారు. తల్లి వెంకటలక్ష్మి టైలరింగ్ నిర్వహిస్తారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం పొందిన సాయికిరణ్‌ని కుటుంబ సభ్యులతో పాటు, బంధుమిత్రులు, స్నేహితులు అభినందిస్తున్నారు.

సేవ చేయాలనే లక్ష్యంతో చదివాను: సాయి కిరణ్



మంచి ఇంజినీర్‌గా సేవ చేయాలని లక్ష్యంతో ప్రభుత్వ కొలువు సాధించాను. ప్రభుత్వ ఉద్యోగాన్ని పొందేందుకు ఐదేళ్లపాటు ఏ శిక్షణ లేకుండా సొంతంగా చదువుకున్నాను. భవిష్యత్తులో దేశం గర్వించదగిన ఇంజినీర్‌గా పని చేస్తాను.

సారపాక ఎన్నికలపై వీడని సందిగ్ధం

బూర్గంపాడు, న్యూస్‌టుడే

సారపాక పంచాయతీ ఎన్నికలపై సందిగ్ధం వీడడం లేదు. సారపాక పంచాయతీని ఒకటిగానే ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీని కలిపి ఉంచాలనే నిర్ణయంతో ఇక్కడ ఓటర్ల జాబితాను వెల్లడించలేదు. పంచాయతీని విభజించకుండా ఉంచడం పట్ల స్థానికుల్లో సానుకూలత వ్యక్తమవుతున్నా ఎన్నికల విషయంలో ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన ఓటర్ల జాబితాలను ఇక్కడ వెల్లడించకపోవడమే ప్రజల్లో చర్చకు కారణమవుతోంది.



సారపాక ప్రధాన కూడలి

పారిశ్రామిక ప్రాంతం సారపాకలో చివరిగా 2013లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. మున్సిపాలిటీగా మారుస్తారనే ప్రచారంతో ఇక్కడ 2018లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేదు. అనంతరం చేపట్టిన పురపాలిక ఎన్నికల్లోనూ సారపాక పేరు చేర్చలేదు. పరిషత్ ఎన్నికల్లోనూ సారపాకను పరిగణనలోకి తీసుకోలేదు. అప్పటి నుంచి ఎన్నికలకు నోచుకోక ప్రత్యేక అధికారుల పాలనలో సాగుతోంది. సారపాకలో ఎన్నికలు నిర్వహించని అంశం రాష్ట్ర ఉన్నత న్యాయస్థానానికి చేరడంతో అప్పటి ప్రభుత్వం సారపాకను రెండుగా విభజిస్తూ నిర్ణయం తీసుకుంది. రహదారికి ఓ వైపు సారపాక పంచాయతీ రెండో వైపు ఐటీసీ పంచాయతీగా మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సారపాకలో ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందని స్థానికులు భావించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల హడావిడి కొనసాగుతోంది. ఎన్నికలకు సంబంధించిన పనులను అధికారులు ప్రారంభించారు. వార్డుల వారీ ఓటరు జాబితాలను వెల్లడించారు. కానీ సారపాకలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ఇక్కడ ఓటరు జాబితాలను వెల్లడించక పోవడంతో ఇప్పటికిప్పుడు ఎన్నికల ప్రకటన వెలువడితే సారపాకలో ఎన్నికలు జరిగే అవకాశాలు లేవన్న భావన స్థానికుల్లో నెలకొంది. సారపాక విషయంలో త్వరితగతిన నిర్ణయం తీసుకుని అన్ని పంచాయతీలతో పాటు ఎన్నికలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మహేశ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఓటరు జాబితాలు వెల్లడించలేదన్నారు. తదుపరి ఆదేశాల మేరకు నడుచుకుంటామని వివరించారు.

కోర్టు విధుల బహిష్కరణ



మేజిస్ట్రేట్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: న్యాయవాది మహ్మద్ అబ్దుల్ కరీంపై మదనపేట పోలీసుల దౌర్జన్యానికి నిరసనగా భద్రాచలం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. జ్యుడీషియల్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ మీసాల వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షులు కోట దేవదానం మాట్లాడుతూ న్యాయవాదిపై పోలీస్‌లు అత్యుత్సాహం ప్రదర్శించి అమానుషంగా కొట్టడాన్ని ఖండించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షులు ఎంవీ.రమణ, జాయింట్ సెక్రటరీ విద్యధరి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు పదవులు కట్టబెట్టండి

కరకగూడెం, న్యూస్‌టుడే: బీసీలకు పదవులు కట్టబెట్టాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆధార్ పార్టీ అధ్యక్షుడు కంటె కేశవ్‌గౌడ్ అన్నారు. గురువారం నిర్వహించిన కరకగూడెం మండల సమావేశంలో మాట్లాడుతూ... రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఆధార్ పార్టీని మండలాలలో విస్తృత పరుస్తామని తెలిపారు. పినపాక నియోజకవర్గం ఇన్‌ఛార్జి పునెం నరేష్, అశ్వారావుపేట ఇన్‌ఛార్జి ఈశే ముత్తయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజిబాబు బుద్దయ్య, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కుక్కల నాగేశ్వరరావు గౌడ్, వెంకన్న, నాగ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సదస్సుకు హాజరుకావాలి

గుండాల, న్యూస్‌టుడే: ఇల్లెందులోని విద్యుత్తు కార్యాలయంలో ఈనెల 4వ తేదీ జరిగే విద్యుత్తు వినియోగదారుల సదస్సుకు హాజరుకావాలని ఏఈ రమేష్‌బాబు తెలిపారు. గురువారం గుండాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సదస్సు(సీజీఆర్‌ఎఫ్) చైర్మన్ వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందన్నారు.

'సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి'



మాట్లాడుతున్న అయోధ్య

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: గ్రామగ్రామాన సీపీఐని బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య అన్నారు. మణుగూరులోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే డిసెంబర్ 26 నాటికి పార్టీ స్థాపించి 100 సంవత్సరాలు అవుతున్నందున పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించాలని అందరూ సిద్ధమవ్వాలన్నారు. నాయకులు పుల్లారెడ్డి, లక్ష్మీకుమారి, అన్నారాయణ, మోహన్‌రావు, దుర్గ్యాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలకు చీరలు అందిస్తాం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం ఐటీడీఏ పరిధిలో గిరిజన మహిళలకు చీరలు అందించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ వెల్లడించారు. గురువారం హైదరాబాద్ నుంచి దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆ తర్వాత క్షేత్రస్థాయి సిబ్బందితో ఏపీఓ మాట్లాడుతూ.. మన్యంలో 18 ఏళ్లు దాటిన గిరిజన మహిళల వివరాలను సేకరించి చీరలు అందించాలని సూచించారు.

తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలి

అశ్వాపురం, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి సరఫరా విషయంలో ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, ఈ మేరకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈఓ చంద్రశేఖర్ అన్నారు. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల మల్టీపర్పస్ వర్కర్లకు గురువారం అశ్వాపురంలోని రైతు వేదికలో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఈఈ తిరుమలేశ్, ఏఈ పి.కిషోర్ పాల్గొన్నారు.

మహిళా కార్మికులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలి

అశ్వాపురం: సీతారాంపురంలోని 'మెగా' కంపెనీ కార్యాలయం నుంచి తొలగించిన మహిళా కార్మికులను తిరిగి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి అనంతనేని సురేశ్ కోరారు. అశ్వాపురంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా విధులు నిర్వహిస్తోన్న మహిళా కార్మికులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే తొలగించడం అన్యాయమన్నారు. వారిని తిరిగి విధుల్లోకి తీసుకోని పక్షంలో కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తొలగింపునకు గురైన మహిళా కార్మికులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: మండలంలో గురువారం ఓ గర్భిణి 108 వాహనంలో వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో ప్రసవించి మగబిడ్డకు జన్మనిచ్చింది. మర్కోడు గ్రామానికి చెందిన యాసారపు బాలమణి ఉదయం ప్రసవ నొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. మర్కోడు గ్రామ శివారుల్లోకి రావడంతో అక్కడే ప్రసవించింది. అనంతరం ఆళ్లపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీ భాగ్యమ్మ, పైలెట్ తులసీరామ్, ఈఆర్‌సీపీ మోనిక పాల్గొన్నారు.

వ్యర్థాలే అడ్డు.. పారని నీరు

అశ్వారావుపేట-గుర్రాలచెరువు మార్గంలో పాఠశాల సమీపంలో.. భద్రాచలం మార్గంలో సాయిబాబా గుడి ఎదురుగా.. గౌడబజారుకు వెళ్లే మార్గంలో పైపు కల్వర్టు వద్ద ప్లాస్టిక్ సీసాలు, కవర్లు అడ్డుపడి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. ఇళ్ల, సంతశాలల్లోకి వరదనీరు చేరుతోంది. ఈ అంశంపై పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్మూర్తి 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కొద్ది రోజుల్లోనే వ్యర్థాలను తొలగిస్తామని తెలిపారు.



– అశ్వారావుపేట, న్యూస్‌టుడే

ఆదమరిస్తే.. ప్రమాదమే!

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మల్కారం-దమ్మపేట ప్రధాన రహదారి అక్కడక్కడ కోతకు గురైంది. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రిపూట గుంతలు కన్పించకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ డీఈఈ శ్రీనివాస్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. రహదారి పక్కన గండ్లు పూడ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.



– దమ్మపేట, న్యూస్‌టుడే

నియోజకవర్గ ప్రగతే లక్ష్యం: పాయం

పినపాక, మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నియోజకవర్గ ప్రగతే తన లక్ష్యమని, నమ్మకంతో గెలిపించిన ప్రజల వెన్నంటి ఉంటానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. పినపాక మండలం భూపాలపట్నం, ఏడూళ్లబయ్యారం, పోతురెడ్డిపల్లి, ఉప్పాక గ్రామాల్లో రూ.60 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రహదారులను గురువారం ఆయన ప్రారంభించారు. ఏడూళ్లబయ్యారం ప్రధాన రహదారి నుంచి రాయిగూడెం వరకు రూ.2.20 కోట్లతో నిర్మించనున్న బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు.

✦ శిక్షణ పొందిన తాగునీటి సహాయకులు గ్రామాల్లో నీటి సరఫరాలో సమస్యలు తలెత్తకుండా కృషి చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. పినపాకలోని రైతువేదికలో ఆర్‌డబ్ల్యూఎస్ మణుగూరు డీఈ బ్రహ్మదేవ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన తాగునీటి సహాయకుల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.

✦ ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు కుటుంబ డిజిటల్ కార్డు మూలంగా మారనుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరులోని భగత్‌సింగ్ నగర్‌లో గురువారం నిర్వహించిన కుటుంబ డిజిటల్ కార్డు సర్వేని ప్రారంభించిన అనంతరం పాయం మాట్లాడుతూ ప్రతి కుటుంబం డిజిటల్ కార్డు పొందాలన్నారు.



సీసీ రహదారులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. సుభాష్‌నగర్, ఏఎస్ఆర్‌కాలనీ, అశోక్‌నగర్‌కాలనీల్లో రహదారులు, సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వెంకట్రావు గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ స్థానికుల అభ్యర్థన మేరకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. నాయకులు శ్రీనివాసరెడ్డి, రత్నం రమాకాంత్, రాజీవ్, రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావుకు సన్మానించిన కాలనీవాసులు

వాడవాడల్లో బతుకమ్మ సంబరాలు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణంలోని పలు కాలనీలలో గురువారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. శాంతి నగర్, మేదర బస్తీ, అశోక్‌నగర్ వంటి చోట్ల మహిళలు ఆడి పాడారు. గిరిజన బీఈడీ కళాశాలలో విద్యార్థినులు అధ్యాపకులు పూల పండుగను పురస్కరించుకుని పూజలు చేశారు. మండపాలలో కొలువైన అమ్మవార్లను భక్తులు విశేష సంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



గిరిజన బీఈడీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

రైతులకు చెక్కుల పంపిణీ

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: గుంపెన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని రైతులకు విడతల వారీగా రూ.3.60 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయని సొసైటీ అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు తెలిపారు. రుణమాఫీ వర్తించిన రైతులతో పాటు, కొత్తగా వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు సొసైటీ కార్యాలయంలో చెక్కులను గురువారం అందజేశారు. సొసైటీ ఉపాధ్యక్షుడు నల్లమోతు వెంకటనారాయణ, సీఈఓ సున్నం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న సొసైటీ అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు

గుర్తు తెలియని వ్యక్తిపై ఠాణాలో ఫిర్యాదు

కరకగూడెం, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వ్యక్తి బుధవారం రాత్రి ఇద్దరు బాలురను అపహరించడానికి ప్రయత్నం చేశాడని ఆ బాలుడి తండ్రి కరకగూడెం పోలీస్ ఠాణాలో గురువారం ఫిర్యాదు చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కరకగూడెం గ్రామానికి చెందిన ఇద్దరు బాలురు ఎస్సీకాలనీలో బతుకమ్మ సందడి చూడడానికి వెళ్లారు. అక్కడ ఉన్న గుర్తుతెలియని వ్యక్తి నాకు ప్రధాన రహదారి తెలియదని ఆ పిల్లలను అడగగా వారికి రహదారి చూపించడానికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. ప్రధాన రహదారి వచ్చినప్పటికీ ద్విచక్ర వాహనం ఆపకపోవడంతో చివర కూర్చున్న బాలుడు దూకాడు. అతడికి గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గుర్తించి వాహన వేగం తగ్గించగా మరో బాలుడు కిందకు దిగాడు. ఈ క్రమంలో స్థానికులు వాహనచోదకుడిని వెంబడించగా కొంత దూరంలో ద్విచక్ర వాహనం వదిలి పారిపోయాడు. స్థానికులు ఆ వాహనాన్ని కరకగూడెం పోలీస్ ఠాణాలో అప్పగించారు. తన కుమారుడిని అపహరించడానికి ప్రయత్నం చేశాడని, ద్విచక్ర వాహనం నుంచి కింద పడడంతో తలకు గాయాలయ్యాయని ఓ తండ్రి పోలీస్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్సై రాజేందర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తండ్రి ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

పశువుల అక్రమ తరలింపుపై కేసు నమోదు

భద్రాచలం, న్యూస్‌టుడే: పశువులను అక్రమంగా తరలిస్తున్న సంఘటనలో భద్రాచలం పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాలు.. దుమ్ముగూడెం మండలం బైరాగులపాడు గ్రామం వద్ద నుంచి రెండు టాటా ఏసీ వాహనాలలో ఆరు పశువులను సుజాతనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోని భద్రాచలంలో పోలీసులు పట్టుకున్నారు. తనిఖీ చేయగా నిబంధనలకు విరుద్ధంగా వీటిని రవాణా చేస్తున్నట్లు గుర్తించి పశువులను గోశాలకు తరలించారు. వాహనాలను స్టేషన్‌కు తరలించి ఇందుకు సంబంధించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయలక్ష్మి తెలిపారు.

డిజిటల్ కార్డు సర్వే ప్రారంభం

అశ్వాపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ హెల్త్ డిజిటల్ కార్డ్ పైలట్ ప్రాజెక్ట్ సర్వేను గురువారం అశ్వాపురం మండలం చంద్రలబోడు గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రారంభించారు. శుక్రవారం కూడా ఈ కార్యక్రమం కొనసాగనుంది. గిరిజన సంక్షేమ ఎస్‌డీసీ రవీంద్రనాథ్ ప్రత్యేక అధికారిగా హాజరయ్యారు. జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి పర్యవేక్షించారు. జిల్లా సీఈఓ చంద్రశేఖర్ కూడా సందర్శించి పరిశీలన జరిపారు. అశ్వాపురం తహసీల్దార్ బి.స్వర్ణ, బూర్గంపాడు తహసీల్దార్ ముజాహిద్దీన్, అశ్వాపురం ఎంపీఓ ముత్యాలరావు ఆధ్వర్యంలో మొత్తం మూడు గ్రూపులుగా ఏర్పడి గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు.



చంద్రలబోడులో సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్ తదితరులు

చర్ల, న్యూస్‌టుడే: డిజిటల్ కార్డు సర్వే పైలట్ ప్రాజెక్టులో భాగంగా చర్ల మండలం పులిగుండాల పంచాయతీ పరిధిలో గురువారం ప్రారంభమైంది. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో యాదయ్య నేతృత్వంలోని 4 బృందాల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లిన అధికారులు ఈ సర్వే చేపట్టారు. కుటుంబంలో పూర్తి వివరాలను అధికారులు సేకరించారు. తొలి రోజు 114 కుటుంబాలను అధికారుల బృందం సర్వే జరిపింది. ఇంటి యజమానిగా మహిళ పేరును చేర్చుతున్నారు. మొబైల్ ఫోన్లలో కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు అధికారుల బృందం ఫొటోలు తీసింది. ఈ పంచాయతీ పరిధిలో మిగిలిన రెండు గ్రామాలల్లో సర్వే చేయాల్సి ఉందని ఎంపీడీవో తెలిపారు.

ములకలపల్లి, దమ్మపేట, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని సిబ్బందిని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. ములకలపల్లి మండలం ముత్యాలంపాడు, దమ్మపేట మండలం అల్లిపల్లిలో డిజిటల్ కార్డుల సర్వే ప్రక్రియను గురువారం పరిశీలించారు. తప్పులకు ఆస్కారం లేకుండా కుటుంబ సభ్యుల పేరు, పుట్టిన తేదీ, ఇంటి యజమానితో గల సంబంధం తదితర వివరాలను నమోదు చేయాలన్నారు. నోడల్ అధికారి సుమ, తహసీల్దార్లు పుల్లారావు, నరేశ్, ఎంపీడీఓలు మహాలక్ష్మి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముంపు బాధితులకు నష్టపరిహారం అందించాలి

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నెలరోజుల క్రితం ఆకస్మాత్తుగా వచ్చిన వరద కారణంగా సర్వస్వం కోల్పోయిన పగిడేరులోని శాంతినగర్ గ్రామస్థులు గురువారం మణుగూరులోని తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శాంతినగర్ మహిళలు మాట్లాడుతూ అర్ధరాత్రి వచ్చిన వరద కారణంగా ఇళ్లలో ఉన్న బియ్యం, నిత్యావసరాలు, వ్యవసాయానికి ఉపయోగించే యంత్రాలు కోల్పోవడంతో పాటు యూరియా బస్తాలు, పశువుల షెడ్లు పూర్తిగా కూలిపోయాయన్నారు.



తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న శాంతినగర్ మహిళలు

ఎకోబ్రిక్స్.. అలంకరణలో అదుర్స్

అశ్వాపురం, న్యూస్‌టుడే

వ్యర్థమనుకున్న వాటితో అర్థవంతమైన పనులను చేయవచ్చని అశ్వాపురం గ్రామ పంచాయతీ నిరూపిస్తోంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అశ్వాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి దాసరి మల్లేశం ఆధ్వర్యంలో వ్యర్థంగా భావించే ప్లాస్టిక్ బాటిల్స్‌తో ఓ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు స్వచ్ఛత కార్యక్రమంలో గ్రామంలో నిత్యం ఖాళీ ప్లాస్టిక్ బాటిల్స్, సంచులు తదితర ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తూ ఉంటారు. వారలా సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను ప్లాస్టిక్ బాటిల్స్‌లో నింపి ప్రత్యేకంగా వాటితో ఎకో బ్రిక్స్‌ను తయారు చేస్తున్నారు. వీటిని మొక్కల చుట్టూ కుండీలుగా, పెద్ద పెద్ద చెట్ల వద్ద సేద తీరేందుకు కూర్చునే బల్లలుగా, గద్దెలుగా తయారు చేయవచ్చని గ్రామ పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ మేరకు గ్రామ పంచాయతీలో ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు వివరించారు. 518 ప్లాస్టిక్ బాటిల్స్‌తో ఎకో బ్రిక్స్‌ను తయారు చేసి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రదర్శించారు. ఎకో బ్రిక్స్ తయారీలో జిల్లాలో ఆదర్శంగా నిలిచినందుకు అశ్వాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిని జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ కొత్తగూడెంలోని తన కార్యాలయంలో ఇటీవలే సన్మానించారు.



రాములోరికి ఘనంగా కల్యాణోత్సవం

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల వారి నిత్యకల్యాణ క్రతువును వీక్షించిన భక్తులు పరమానంద భరితులయ్యారు. ఏమి నోము ఫలమో ఇంతటి భాగ్యం కలిగిందంటూ ప్రణమిల్లారు. ప్రధాన కోవెలలో కొలువైన మూలమూర్తులు దర్శనమివ్వడంతో పులకించారు. రామయ్యకు అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి ఆరాధించారు. వైదిక పెద్దలు చేసిన ప్రవచనం ఆకట్టుకుంది. భద్రాద్రిలో కొలువైన సీతారామలక్ష్మణులను దర్శించుకుంటే అంతా శుభమే సిద్ధిస్తుందని సుభాషించారు.

అట్టహాసంగా రామాయణ పారాయణం ఆరంభం: భద్రాచలం రామాలయంలో విజయ దశమి మహోత్సవాలలో భాగంగా 12 వరకు కొనసాగనున్న రామాయణ మహా పారాయణం గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. చిత్రకూట మండపంలో భక్తులు సామూహికంగా బాల కాండను పారాయణం చేశారు. స్థానాచార్యులు స్థలసాయి, ప్రధానార్చకుడు విజయరాఘవన్ పర్యవేక్షణలో ఈ క్రతువు భక్తిభావాలను పంచింది. ఇక వరసగా అయోధ్యకాండ, అరణ్య, కిష్కింద, సుందర, యుద్ధ కాండల పారాయణం ఉంటుంది. అమ్మవారి అలంకారాలు 4న మొదలై 12 వరకు ఉంటాయి. ఇందులో తొలి రోజైన శుక్రవారం ఆదిలక్ష్మీ అలంకారంలో దర్శనం ఉంటుంది. ఇదే రోజున చిత్తా నక్షత్రం సందర్భంగా యాగశాలలో సుదర్శన హోమం చేయనున్నారు.

శరన్నవరాత్రులు ప్రారంభం

భద్రాచలం పట్టణం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, చర్ల, మణుగూరు సాంస్కృతికం, అశ్వాపురం, అశ్వారావుపేట గ్రామీణం, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, న్యూస్‌టుడే: భద్రాచలం పాత మార్కెట్, శాంతినగర్, అశోక్‌నగర్, ఆదర్శనగర్, రామాలయం ఏరియా కాలనీల్లో దేవీ శరన్నవరాత్రులు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవార్లను నూతన పట్టు చీరలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పొదెం వీరయ్య మండపాలను సందర్శించి అమ్మవార్లను దర్శించుకున్నారు.



భద్రాచలంలో అమ్మవార్లను దర్శించుకున్న పొదెం వీరయ్య

దుమ్ముగూడెం, బూర్గంపాడు, అశ్వాపురం మణుగూరు, అశ్వారావుపేట, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి తదితర మండలాల్లో స్థానిక అధికారులు, భక్తులు పూజలు చేశారు.

కొత్తగూడెం
• కొత్తగూడెం • ఇల్లెందు

'సర్వజన' అంధకారం


ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద వెలగని లైట్లు

కొత్తగూడెం వైద్యవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా సర్వజన ఆసుపత్రిలో గురువారం సాయంత్రం విద్యుత్తుకు అంతరాయం ఏర్పడింది. దీంతో వార్డుల్లోని రోగులు ఉక్కపోతతో విలవిలలాడారు. రాత్రి 8.30 గంటలైనా మరమ్మతులు పూర్తిచేయకపోవడంతో రోగులు, వారి సహాయకులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. కనీసం జనరేటర్ సదుపాయం లేకపోవడంపై వారిని నిలదీశారు. డయాలసిస్ విభాగంలో రోగులు చికిత్స పొందడంలో ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

కొత్తగూడెం సంక్షేమ విభాగం, న్యూస్‌టుడే: కొత్తగూడెం బాబుక్యాంపు ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 5న ఉద్యోగ మేళాను ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీ ఆధ్వర్యంలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాల్లో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కొత్తగూడెం: 8008573723 పాల్వంచ: 9550076766 ఇల్లెందు: 9154846689

సమస్య: సుజాతనగర్ పంచాయతీ ప్రాంతం వారికి శుద్ధజలాలు సరఫరా కావడం లేదు. దీంతో మినరల్ ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తోంది. **- స్థానికులు**

సమాధానం: గ్రామపంచాయతీనున్న మినరల్ వాటర్ ప్లాంట్‌కు నీళ్లు అందించే మోటారు మరమ్మతులకు గురైంది. మరమ్మతులు చేయించి శుక్రవారమే నీళ్లు సరఫరా చేస్తాం. **- పంచాయతీ కార్యదర్శి చెన్న కేశవరావు**, సుజాతనగర్, న్యూస్‌టుడే

రామవరం మాతా, శిశు వైద్యశాలకు నిత్యం ఎంతోమంది వచ్చివెళ్తున్నారు. ఇక్కడ హైవేపై ఆటోలు, బస్సుల కోసం ఎదురుచూసేందుకు కనీసం షెల్టర్ లేదు. **- మున్వర్, రుద్రంపూర్**

✔ రుద్రంపూర్ సెంటర్‌లో ఒక బస్సు షెడ్డు ఏర్పాటు చేశాం. ఎంసీహెచ్ ఎదురుగా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తాం. **- జీఎం షాలేము రాజు**, కొత్తగూడెం సింగరేణి (చుంచుపల్లి), న్యూస్‌టుడే

ప్రయోగాత్మకంగా డిజిటల్ సర్వే


ఇల్లెందు మండలంలో పూబెల్లిలో సర్వే కార్యక్రమంలో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, అధికారులు కాశయ్య, రవికుమార్, ధన్‌సింగ్

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం కుటుంబ డిజిటల్ కార్డులు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా ఇల్లెందు 22వ వార్డులో కుటుంబ సభ్యుల వివరాలను గురువారం సేకరించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్‌ఛైర్మన్ జానీపాషా, స్థానిక కౌన్సిలర్ నవీన్‌కుమార్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి కాశయ్య, కమిషనర్ యాదగిరి పాల్గొన్నారు.

ఇల్లెందు గ్రామీణం: డిజిటల్ కార్డుల వివరాల సేకరణను క్షేత్రస్థాయిలో పక్కాగా సేకరించాలని జిల్లా కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పూబెల్లి గురువారం నుంచి ప్రారంభించిన పైలెట్ సర్వేను అధికారులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఇల్లెందు నియోజకవర్గ ప్రత్యేకాధికారి కాశయ్య, ఇల్లెందు, టేకులపల్లి తహసీల్దార్లు రవికుమార్, నాగభవాని, ఎంపీడీవో ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి పాల్గొన్నారు.

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ బొల్లోరిగూడెం పదో వార్డులో కుటుంబ డిజిటల్ కార్డుల ప్రయోగాత్మక సర్వేను గురువారం ప్రారంభించారు. తొలిరోజు 330కి గాను 180 మంది కుటుంబాల వివరాలు నమోదు చేశారు. ప్రక్రియను జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఆర్డీఓ మధు స్వయంగా పరిశీలించారు. తహసీల్దార్ వివేక్, మున్సిపల్ కమిషనర్ ఢాకునాయక్, రెవెన్యూ ఆర్.ఐ. రవికుమార్ ఆధ్వర్యంలో ప్రక్రియ చేపట్టిన బృందాలకు వారు పలు సూచనలు చేశారు.

సర్కారీ కొలువే అయినా..
బోధన వృత్తే మిన్న!

వారంతా సమాజంలో గౌరవప్రదమైన ప్రభుత్వ కొలువుల్లో కొనసాగుతున్నారు. అయితేనేం.. మనసుకు నచ్చిన వృత్తి వేరొకటి ఉంది. అందుకే అవకాశం వచ్చే వరకు ఎదురుచూశారు. నోటిఫికేషన్ రాగానే సన్నద్ధత ప్రారంభించారు. వందలాది మందితో పోటీపడ్డారు. జిల్లాస్థాయి ర్యాంకులు కైవసం చేసుకుని, కలల కొలువైన ఉపాధ్యాయ వృత్తికి ఎంపికయ్యారు. ఇతర సర్కారీ ఉద్యోగాలను కాదనుకుని, బోధన వృత్తిలో చేరేందుకు ఆసక్తిచూపుతున్న పలువురు విజేతల మనోగతంపై 'న్యూస్‌టుడే' కథనం.

పాల్వంచ, న్యూస్‌టుడే

ఆ మూడు ఉద్యోగాలు వదులుకొని..



మాది పాతపాల్వంచ. భర్త శ్రీనివాసరావు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఆయన ప్రోత్సాహం, సూచనలతో పక్కా ప్రణాళికతో డీఎస్సీకి సిద్ధమయ్యా. గత ఏళ్లుగా ప్రైవేట్ ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అనుభవం ప్రిపరేషన్‌కు ఎంతో కలిసొచ్చింది. ఈ ఏడాది గురుకుల పోస్టుల భర్తీలో టీజీటీ, పీజీటీ పోస్టులతో పాటు జూనియర్ లెక్చరర్‌గానూ విజయం సాధించా. బీసీ గురుకులంలో నెల రోజులు పనిచేశా. స్థానికంగా ఉపాధ్యాయ వృత్తి సాగించాలనే లక్ష్యంతో డీఎస్సీకి ప్రిపేరయ్యా. తాజా ఫలితాల్లో ఎస్జీటీ, ఎస్ఏ(హిందీ)లో జిల్లా 1వ ర్యాంకు సాధించడం ఎంతో సంతోషాన్నిచ్చింది. ఎస్ఏగా విధుల్లో చేరనున్నాను. **- నిమ్మల విజయ**

సింగరేణి కొలువు ఉన్నా..



సింగరేణి బదిలీ వర్కర్‌గా 2022 సంవత్సరంలో ఉద్యోగం వచ్చింది. గోదావరిఖనిలో పనిచేస్తున్నా. ఉపాధ్యాయ కొలువు పట్ల ఉన్న మక్కువతో డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి సిద్ధమయ్యాను. ప్రత్యేక ప్రణాళికతో సమయం కేటాయించుకున్నాను. ఎస్జీటీలో జిల్లా 143వ ర్యాంకు లభించింది. మాది ఇల్లెందు మండలం పూబల్లి గ్రామం. ఉద్యోగ విజయాల్లో తల్లిదండ్రులు మల్లయ్య, శంకరమ్మ ప్రోత్సాహం ఎంతో ఉంది. **- యు.వీరభద్రం**

మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తూ..



మాది జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామం. 2020లో మహిళా కానిస్టేబుల్‌గా విధుల్లో చేరా. అయినా ఉపాధ్యాయ వృత్తి అంటే ఇష్టం. గత మార్చిలో డీఎస్సీ నోటిఫికేషన్ రావడంతో విధులకు 5 నెలల పాటు సెలవు పెట్టాను. పరీక్షలకు పట్టుదలతో సిద్ధమయ్యా. ఎస్జీటీ విభాగంలో జిల్లా స్థాయిలో 36వ ర్యాంకు దక్కించుకున్నా. వివాహమై కుటుంబ బాధ్యతలు మీదపడినా, భర్త వీరయ్య ప్రోత్సాహంతో ఉపాధ్యాయ వృత్తి కలను సాకారం చేసుకోవడం సంతోషంగా ఉంది. **- అరిగెల నర్సమ్మ**

స్థానికేతర ఉద్యోగం వద్దనుకుని..



కొంత ఓపిక పట్టి.. అవకాశం వచ్చాక పట్టుదలతో కృషిచేస్తే కలల కొలువు సాధించడం పెద్ద కష్టమేమీ కాదని నిరూపించేందుకు నేనే ఓ ఉదాహరణ. 2019 నుంచి 2024 వరకు పంచాయతీ కార్యదర్శిగా పనిచేశా. కానీ ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో గురుకుల ఉద్యోగాలకు సిద్ధమయ్యా. 2024, ఆగస్టు 1 నుంచి హుజూరాబాద్‌లో మైనార్టీ గురుకులంలో టీజీటీ (ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్)గా పనిచేస్తున్నా. ఆ ఉద్యోగం నాన్‌లోకల్ విభాగంలో వచ్చింది. దీంతో డీఎస్సీకి పట్టుదలతో సన్నద్ధమయ్యాను. తాజాగా విడుదలైన ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ 17వ ర్యాంక్ వచ్చింది. మాది ములకలపల్లి మండలంలోని రామచంద్రపురం గ్రామం. అమ్మానాన్నలు అక్కులు, నాగరత్నం ప్రోత్సాహంతో పోటీ పరీక్షల్లో విజయం సాధించా. **- జె.శ్రీనివాసరావు**

అనుబోస్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా

పాల్వంచ, న్యూస్‌టుడే: పాల్వంచ పట్టణంలోని అనుబోస్ ఇంజినీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా లభించినట్లు కళాశాల ఛైర్మన్ భరత్‌కృష్ణ గురువారం ప్రకటించారు. 2008లో కళాశాలను ప్రారంభించామని గుర్తు చేశారు. కళాశాలకు అటానమస్ హోదా దక్కటంతో ప్రిన్సిపల్ రవికుమార్, కరస్పాండెంట్ అవని, డైరెక్టర్ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ వెంకన్న హర్షం వ్యక్తం చేశారు.

న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ నిరసన

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: సిటీ సివిల్ కోర్టు(హైదరాబాద్)లో న్యాయవాది ఖలీల్‌ని వర్ధన్నపేట పోలీసులు దాడి చేయడాన్ని ఖండిస్తూ కొత్తగూడెం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ న్యాయవాదిపై పోలీసుల దాడి హేయనీయమన్నారు. కార్యవర్గసభ్యులు తోట మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఐలూ సభ్యత్వ నమోదు: ఆలిండియా లాయర్స్ సంఘం (ఐలూ) సభ్యత్వాల నమోదును జిల్లా కోర్టు ఆవరణలో గురువారం చేపట్టారు. బాధ్యులు రమేశ్‌కుమార్ మక్కడ్, జె.శివరాంప్రసాద్‌లు సభ్యత్వాలు అందజేశారు.

'108'లోనే ప్రసవం

కొత్తగూడెం నేరవిభాగం: లక్ష్మీదేవిపల్లి మండలం చింతకుంటకు చెందిన జారా సుజాత(25)కు బుధవారం అర్ధరాత్రి పురిటినొప్పులు వచ్చాయి. సమాచారం అందడంతో జూలూరుపాడు మండల 108 సిబ్బంది వెంటనే గ్రామానికి చేరుకున్నారు. మార్గం మధ్యలో రేగళ్ల వద్ద నొప్పులు అధికం కావడంతో ఈఎంటీ రవి, పైలెట్ సంతోశ్‌లు సుఖ ప్రసవం అయ్యేలా చూశారు. సుజాత మగ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డను రామవరం ఎంసీహెచ్‌లో చేర్పించారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

పాల్వంచ గ్రామీణం: మొర్రేడు వాగు నుంచి పాల్వంచ పట్టణానికి ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అటవీశాఖ రేంజర్ సురేశ్ పట్టుకుని డ్రైవర్లపై కేసు నమోదు చేశారు.

'ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విఫలం'

టేకులపల్లి, న్యూస్‌టుడే: ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించి దశాబ్ద కాలం ముగిసినా ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో పాలకులు విఫలమయ్యారని తెలంగాణ ప్రజాఫ్రంట్ నాయకులు ఎట్టి ప్రశాంత్ ఆరోపించారు. టీపీఎఫ్ 15వ ఆవిర్భావ వేడుకల కరపత్రాలను గురువారం టేకులపల్లిలో ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 9న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. మెంతెన ప్రభాకర్, వీరభద్రం పాల్గొన్నారు.

'మహిళా శక్తి'కి రుణ భరోసా

సుజాతనగర్, న్యూస్‌టుడే: 'మహిళా శక్తి పథకం'లో భాగంగా అతివలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు చేయూత అందిస్తామని స్థానిక ఏపీజీవీబీ మేనేజర్ నరేశ్ అన్నారు. సుజాతనగర్‌లోని బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీసీ శిరీష, శ్రీలక్ష్మి, గ్రామదీపిక మాధవి పాల్గొన్నారు.

పకడ్బందీగా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. కొత్తగూడెం సింగరేణి కాలరీస్ హైస్కూల్‌లో రెండోరోజు గురువారం చేపట్టిన కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. శనివారంలోగా అభ్యర్థులందరి ధ్రువపత్రాలను పరిశీలించేలా చర్యలు చేపట్టాలని డీఈవో ముమ్మడి వెంకటేశ్వరాచారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ నాగరాజశేఖర్, సెక్టోరియల్ అధికారులు సైదులు, సతీశ్‌కుమార్, ఏపీఓ కిరణ్‌కుమార్, ఎంఈఓలు పాల్గొన్నారు.

మంచి రోజు కావడంతో సందడి.. డీఎస్సీ-2024 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన సందర్భంగా కౌంటర్ల వద్ద సందడి కనిపించింది. తొలిరోజు బుధవారం అమావాస్య కావడంతో సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ) పెద్దగా ప్రక్రియకు తరలిరాలేదు. గురువారం వారంతా కుటుంబ సభ్యులతో కలిసి భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ ఒక్కరోజే ఉదయం నుంచి రాత్రి వరకు 400 మందికి పైగా అభ్యర్థుల ధ్రువపత్రాలను అధికారులు పరిశీలించారు.

అడవిని వదిలి... ఆకలి తీర్చుకొనేందుకు పాట్లు



చెట్ల నరికివేత, పండ్ల కొరత నేపథ్యంలో అడవులను వీడుతున్న వానరాలు ఆకలి తీర్చుకునేందుకు జనావాసాల్లోకి వస్తున్నాయి. కొత్తగూడెం నుంచి ఇల్లెందు వెళ్లే మార్గంలో వాహనదారులు అందించే ఆహారం కోసం గుంపులుగా వానరాలు ఎదురుచూస్తున్న దృశ్యమిది.

– చుంచుపల్లి (కొత్తగూడెం సింగరేణి), న్యూస్‌టుడే

కుందేళ్ల గంతులు.. పక్షుల కిలకిలారావాలు




కిన్నెరసానిలో పర్యాటక కేంద్రానికి వచ్చే పర్యాటకుల సందర్శనార్థం రెండు కుందేళ్లు (ఆడ, మగ), రెండు జతల బడ్జీస్ పక్షులు (ఆడ, మగ)లను ప్రత్యేకంగా తీసుకొచ్చారు. వీటిని అటవీశాఖ సిబ్బంది ప్రత్యేకంగా బోనులలో పెట్టి సంరక్షణ చేపడుతున్నారు. ప్రత్యేక ఆహారాన్ని అందిస్తున్నారు. పర్యాటకుల వెంట వచ్చే చిన్నారులు కుందేళ్ల గంతులు, పక్షుల సందళ్లు చూసి ఆనందంలో తేలియాడుతున్నారు.

– పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే

కార్పొరేషన్‌తో జంట పట్టణాల అభివృద్ధి

పాల్వంచ, న్యూస్‌టుడే: కొత్తగూడెం-పాల్వంచ జంట పట్టణాల అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడారు. విమానాశ్రయం, కొత్త బైపాస్ నిర్మాణాలకు కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముత్యాల విశ్వనాథం, సాయిబాబా, పూర్ణచంద్రరావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్ పాల్గొన్నారు.

బాలుడికి డీఎస్పీ అభినందన



కొత్తగూడెం పట్టణం: కొత్తగూడెంలో ఇటీవల జరిగిన జిల్లా స్కూల్ గేమ్స్ రెజ్లింగ్ పోటీల్లో 14 ఏళ్లలోపు బాలుర విభాగంలో ఎం.ఎ. అయాన్ ప్రతిభచూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అయాన్‌తో పాటు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీహుస్సేన్‌ను కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహ్మాన్ తన కార్యాలయంలో గురువారం అభినందించారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ: కొత్తగూడెం ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఇల్లెందులోని క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

అడవుల సంరక్షణ.. అందరి బాధ్యత: ఎఫ్‌డీవో

పాల్వంచ గ్రామీణం: అడవులు, వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వన్యప్రాణి సంరక్షణ విభాగం ఎఫ్‌డీవో బాబు అన్నారు. వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకొని ఆళ్లపల్లి, కిన్నెరసాని, మర్కోడు, చాతకొండ రేంజ్‌లోని గొత్తికోయల గ్రామాల్లో గురువారం అవగాహన కల్పించారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించారు. రేంజర్ కవితామాధురి, కిషన్, రాములు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను పారదోలాలి: బైరి


మాట్లాడుతున్న నరేశ్

చుంచుపల్లి: మూఢ నమ్మకాల నిర్మూలనకు ప్రభుత్వాధికారులు చర్యలు చేపట్టాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు బైరి నరేశ్ కోరారు. హౌజింగ్‌బోర్డులో సంఘం నాయకులతో కలిసి గురువారం ఆయన మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో అంధ విశ్వాసాల్ని పారదోలేందుకు ఐటీడీఏ, వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ అధికారులు చైతన్యం కలిగించాలన్నారు.

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం శుభ్రం చేసే యంత్రాలు, తేమను పరీక్షించే యంత్రాలు, టార్పాలిన్ పట్టాలను సిద్ధం చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ వ్యవసాయ, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్‌రెడ్డి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అనంతరం ఆయన అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఏఈవోలు గ్రామాలను సందర్శించి ధాన్యం దిగుబడిని అంచనావేయాలని ఆదేశించారు.

పరుపుల ఆర్డర్ పేరుతో సైబర్ మోసం

టేకులపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని బొమ్మనపల్లికి చెందిన సురేశ్ కొత్తగూడెంలోని బంధువుకు చెందిన ఓ ఫర్నిచర్ దుకాణంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. యజమానికి ఓ సైబర్ నేరగాడు గురువారం ఫోన్‌చేసి పరుపులను ఆర్డరుపై కొత్తగూడెంలోనే డెలివరీ చేయాలని కోరాడు. ఇది నిజమేనని నమ్మిన సదరు యజమాని ఆర్డర్ తీసుకోవాలని సురేశ్‌కు సూచించారు. తొలుత ఒక రూపాయి పంపితే, తాను ఆర్డరు నగదు ఫోన్‌పే చేస్తానని నేరగాడు నమ్మబలికాడు. ఆ తర్వాత రూ.9,999 పంపాలని అన్నాడు. అలా రెండు గంటలు మాటల్లో పెట్టి ఏకంగా పన్నెండు సార్లు రూ.71 వేలను ఫోన్ పే ద్వారా సురేశ్ ఖాతాలోంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. మోసపోతున్నానని గ్రహించిన సురేశ్ తేరుకుని '1930'కి ఫిర్యాదు చేయగా.. టేకులపల్లి పోలీసులు స్పందించి నేరస్థుడి ఖాతాలోని రూ.23 వేలను స్తంభింపజేశారు.

బాలాత్రిపుర సుందరీ.. పాహిమాం


ఇల్లెందు గ్రామీణం: అమ్మవారి విగ్రహంతో ఎమ్మెల్యే కోరం దంపతులు

న్యూస్‌టుడే యంత్రాంగం: ఇల్లెందు పట్టణం జేకే కాలనీ, పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన దేవీ శరన్నవరాత్రుల మండపాల్లో దుర్గాదేవి బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్టేషన్‌బస్తీ, నెం.2 బస్తీ శ్రీకృష్ణ భజన మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు మండపాల్లో ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ డి.వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ జానీ పాషా, డానియల్, జాఫర్ పాల్గొన్నారు.

ఇల్లెందు ఠాణాలో గురువారం నిర్వహించిన సమావేశంలో సీఐ బత్తుల సత్యనారాయణతో కలిసి డీఎస్పీ చంద్రభాను మాట్లాడారు. బతుకమ్మ, కోటమైసమ్మ ఉత్సవాలను ప్రశాంతవాతావరణంలో జరుపుకోవాలని భక్తులకు సూచించారు. చుంచుపల్లి మండలం విద్యానగర్ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) పంకజ్ పరితోష్ దంపతులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పాల్వంచలోని రాజీవ్‌గాంధీ మార్కెట్, నవభారత్, సంజయ్‌నగర్, మార్కెట్ ఏరియా, బొల్లోరిగూడెం, ఇందిరానగర్‌కాలనీ, కేటీపీఎస్ కాలనీల్లోని మండపాల్లో కొలువుదీన అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. పూజల్లో డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు. జూలూరుపాడు మండల కేంద్రంతో పాటు పాపకొల్లు, వెంగన్నపాలెం, గుండెపూడి, కాకర్ల, పడమటినర్సాపురం తదితర గ్రామాల్లో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. టేకులపల్లి మండల కేంద్రంలోని కోదండరామాలయం, బ్రహ్మంగారి వీధి, శివాలయం, బోడు, కోయగూడెం ఓసీ, సేవాఘడ్‌లో తొలిరోజు అమ్మవారికి బాలాత్రిపురసుందరీ దేవీ అలంకారం చేశారు.


పాల్వంచ: సంజయ్‌నగర్‌లో కొత్వాల పూజలు..


చుంచుపల్లి: అదనపు ఎస్పీ పంకజ్ దంపతులు..


ఇల్లెందు: నెం.2 బస్తీ భజన మందిరంలో..


టేకులపల్లి: బ్రహ్మంగారి వీధిలో పూజలు..


జూలూరుపాడు: వెంగన్నపాలెం టీచర్స్‌కాలనీలో..


ఇల్లెందు: స్టేషన్‌బస్తీలో..

బంతాటలో.. బొగ్గుట్ట యువకులు భళా!

బొగ్గుట్ట ఏరియా యువ క్రీడాకారులు అద్భుత ప్రతిభతో రాణిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎంపికల్లో సత్తాచాటి వర్సిటీ క్రీడాపోటీలకు మరోసారి ఎంపికయ్యారు. ఒకరు ఫుట్‌బాల్‌లో, మరొకరు వాలీబాల్‌లో గత మూడేళ్లుగా అద్భుత నైపుణ్యాల్ని ప్రదర్శిస్తూ కేయూ వర్సిటీ క్రీడల్లో ప్రాతినిధ్యం వహిస్తుండటం విశేషం.

– ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

ఫుట్‌బాల్‌లో.. చంద్రశేఖర్



పట్టణంలోని కోర్టు ఏరియాకు చెందిన భూక్య చంద్రశేఖర్ ఇల్లెందు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఆయన పాఠశాల స్థాయి నుంచే ఫుట్‌బాల్ సాధన చేస్తున్నారు. కళాశాలలో చేరాక వర్సిటీ స్థాయిలో కీలక ఆటగాడిగా (మెయిన్ స్టాఫర్) ప్రతిభ కనబర్చుతున్నారు. క్రీడల్లో రాణిస్తూ ఉన్నతోద్యోగం సాధించడమే లక్ష్యంగా చెబుతున్న చంద్రశేఖర్ విజయ ప్రస్థానమిదీ..

★ 2016లో రామగుండంలో, అదే ఏడాది ఖమ్మంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ

★ 2017లో మంచిర్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రశంస

★ 2021లో భద్రాచలంలో, 2022లో పాల్వంచలో జరిగిన జిల్లా నుంచి కేయూ వర్సిటీ పోటీలకు ప్రాతినిధ్యం. అక్కడ ప్రతిభ చూపి కేరళ రాష్ట్రం కాలికట్‌లో నిర్వహించిన ఇంటర్ వర్సిటీ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌కు ప్రాతినిధ్యం.

★ గతేడాది కర్ణాటక వర్సిటీ నిర్వహించిన సౌత్‌జోన్ పోటీల్లోనూ కేయూ నుంచి ప్రాతినిధ్యం.

★ త్వరలో జరగనున్న ఇంటర్ యూనివర్సిటీ సౌత్‌జోన్ పోటీలకు 'మెయిన్ స్టాఫర్'గా పాత్ర పోషించనున్నారు.

వాలీబాల్‌లో.. దీపక్



మండలంలోని మామిడిగుండాలకు చెందిన ఇర్ప దీపక్ ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్నార్ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. యూనివర్సిటీల స్థాయి పోటీల్లో రెండుసార్లు పాల్గొన్న అనుభవం ఉంది. మరోసారి తన క్రీడా ప్రతిభతో కేయూ వర్సిటీ క్రీడా పోటీల్లో పాల్గొననున్న ఖమ్మం జిల్లా వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు.

▮ 2022లో చెన్నై ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీ, గతేడాది కర్ణాటక రాష్ట్రం బెళగావిలో నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో కేయూ వర్సిటీ జట్టు సారథిగా వ్యవహరించారు. జట్టు సమష్టిగా రాణించడంలో కీలకంగా వ్యవహరించారు. 2020లో జార్ఖండ్‌లో జరిగిన జూనియర్ నేషనల్స్‌లో, 2019లో మంచిర్యాలలో తెలంగాణ రాష్ట్రస్థాయి వాలీబాల్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు.

'ఎంటీయూ-1262' రకం వరిపైరు పరిశీలన


పైరును పరిశీలిస్తున్న ఏవో నర్మద, ఏఈఓ శరత్‌చంద్ర

సుజాతనగర్, న్యూస్‌టుడే: 'ఎంటీయూ-1262' రకం వరి పంటకాలం 170 రోజులని, కానీ మూణ్నెల్లలోపే కంకులు ఈనుతున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేయడంతో మండలంలోని పలు గ్రామాల్లోని పొలాలను ఏవో నర్మద గురువారం పరిశీలించారు. పంట కంకులు ముందే వస్తుండటం వల్ల దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారని ఆమె అన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలకు తెలిపినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ శరత్ చంద్ర, రైతులు పుల్లయ్య, మౌలాసాహెబ్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

పేదల స్థలాల్లో వసతుల 'వెన్నెలేదీ'?



కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పాత కొత్తగూడెం వెన్నెల నగర్‌లో పేదలకు గతేడాది ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో కనీస సదుపాయాలు కల్పించాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని 'సేవ్ కొత్తగూడెం - సేవ్ మున్సిపాలిటీ' ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. అంతకు ముందు కాలనీ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేపట్టారు. మహ్మద్ జలాల్ మాట్లాడుతూ.. 36వ వార్డులోని వెన్నెలనగర్‌లో 807 మందికి స్థలం కేటాయించిన అధికారులు కనీస వసతులు కల్పించడం లేదన్నారు. అనంతరం ఏఓ ఎం.రమాదేవికి వినతి పత్రం అందించారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్, ఖాదర్, రాజు, నర్సింహా, మల్లేష్, సుజాత, సఫియా, రాజేశ్వరి పాల్గొన్నారు.